

## ప్రార్థన

కం॥ వినిపింతు ప్రౌఢ లీలలు
జనులారా! కృష్ణమూర్తి సాయముజేతన్
ఘనుతా వల్లభ గురులే
పనిగా తామిచ్చుగాక! పరమానందమే.

శ్రీకృష్ణావతార ఉద్దేశ్యమే ధర్మ సంస్థాపనము. దానికోసం స్వామి గొల్లవారింట పెరిగాడు. దుర్మార్గులైన రాజుల చేత అవమానింపబడినాడు. సారధియై బాణముల గాయాలు సహించాడు. తన భక్త రక్షణకు జీవించాడు.

## ముందుమాట

శ్రీమద్వల్లభాచార్య విరచిత “త్రివిధ నామావలి” అను గ్రంధమునకు సరళ తెలుగు వివరణ అందించే ప్రయత్నం శ్రీకృష్ణ భగవానుని ప్రేరణతో చేస్తున్నాను. 15 సంవత్సరాల క్రితం డా. బీవీఎస్ఆర్ మూర్తిగారి ప్రోత్సాహంతో త్రివిధ నామావలిని చిన్నపుస్తకంగా అచ్చువేయించి సన్మిత్రులకు పంచిపెట్టాను.

ఇన్నాళ్టికి దాని వివరణ అందించాలనే ఆలోచన కలిగింది. ప్రస్తుతం మూర్తిగారు గుజరాత్‌లో ఉంటున్నారు. 90 వసంతాల వారు ప్రోత్సహించి నాకు సహాయం చేయలేరనే బెంగతో నేను వెనకాడినా డా. జీఎం రామశర్మగారి సహాయం లేకపోతే సంస్కృతము రాని నావంటి అవిటివాని వలన ఈ పని సాధ్యమవుతుందా?

మా పెద్ద అబ్బాయి చి. ఏవీఎస్ రామకృష్ణ ప్రోద్బలం నా బలం అని చెప్పటం నా విధి.

వల్లభాచార్యుల వారు 3 భాగాలుగా చెప్పిన దీనిని పూర్తిచేయించే భారం మాత్రం పురుషోత్తముడైన ఆ జగద్గురువుదే. నేను కేవలం నిమిత్తమాత్రుడను.

అన్నట్లు దీనిని డీటీపీ చేసినది మురళీకృష్ణయే. నా వెబ్‌సైట్లో పెట్టేది పాండురంగడు.

ఇది భగవత్ కృప కాక మరేమిటి? దీనిని నిత్యపారాయణ చేసినవారికి ముక్తి కరతలామలకం అని చెప్పటంలో నాకు అణుమాత్రం సందేహం లేదు.

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

## అంకితం

సీ॥ అంకితమిత్తును ఆర్ష ద్వైతగురుండు
మధ్వమతాచార్య మణి సములుకు,

పాండురంగడు నాడు పరమాత్ముడై తోపె
గీతదీక్షకు స్ఫూర్తి కీర్తి అతడె

మురళీకృష్ణుడు నాకు ముందుండి నడిపెను
ఆద్యంతముల కర్త అమిత శక్తి,

వేంకటేశ్వరరావు వెన్నుదన్నై నిల్చె
ఆయన సాయమ్ము అసలు బలము

తే॥ వల్లభాచార్యులే నాకు
సులభసాధ్యుడు “త్రిశతి” తొలుత పలికె
వారి కృపచేతనేనివి వ్రాసినాడ
శతసుభంబులు దీనిని చదువుడయ్య

## 1. శ్రీ కృష్ణాయనమః

Sri Krishnaaya Namaha

**ఓ శ్రీకృష్ణా! నీకు నమస్కారము**

కృష్ణ అంటే సామాన్య అర్థం నలుపు. కృష్ణయ్య అంటే నల్లనయ్య అని అర్థం. శ్రీకృష్ణ అంటే మంగళప్రద్రమైన నల్లనయ్య. నలుపు–చీకటికి, అజ్ఞానానికి, దుఃఖానికి, చెడుకి సంకేతం కదా! మరి పరమాత్మ కృష్ణ భగవానుడెందుకు అయ్యాడు? చీకటివంటి అజ్ఞానాన్ని తొలగిస్తాడు కాబట్టి కృష్ణయ్య అయ్యాడు. భగవద్గీతాచార్యుడు అయ్యాడు. అన్నిటికంటే సంపద జ్ఞానం కాబట్టి శ్రీకృష్ణయ్య అయ్యాడు. జగద్గురువయ్యాడు.

తలవంచి నమస్కరించటం మన కనీస కర్తవ్యము కదా! అందుకె శ్రీకృష్ణాయనమః నాన్నగారు జన్మనిచ్చిన తండ్రి, కాని గురువు జ్ఞానమిచ్చిన తండ్రి. కర్తవ్యం బోధించే తండ్రి. బ్రతుకునిచ్చి బ్రతుకు నేర్పే తండ్రి. తప్పులు చేయవద్దని ఆపదల ద్వారా హెచ్చరించే తండ్రి. కన్నీళ్లు పెట్టించి దండించే తండ్రి. అప్పటికీ వినక చెడిపోతే తన కొడుకు తగనివాడని ఆపద సృష్టించి చంపివేసే తండ్రి. అటువంటి తండ్రి మన శ్రీకృష్ణయ్య. మీ పిల్లలకి కృష్ణ అని పేరు పెడితే 'కిట్టిగా' అని తిట్టకండి. మహాపాపం.

## 2. నరాకృతయే నమః

Naraakrutayae Namaha

**నరుని రూపంలో వున్న నారాయణునికి నమస్కారము.**

భగవంతుడు నిరాకారి, నిరంజన, నిర్నిమిత్త నిర్వహకుడు. మన నాన్న సూటు బూటూ ధరించి అత్యుత్తమమైన సింహాసనం మీద కూర్చుంటే 'నాన్నా' అని పిలువలేము. అందుకే ఆయన కృష్ణయ్యగా వచ్చి చనువుగా ఆడి, పాడిన తండ్రి అయ్యాడు. విశ్వరూపి కాకి నరరూపియైనాడు. నరుడు చేయవలసిన పనులన్నీ చేశాడు.

ఇది వ్రాతలో వివరించలేని విషయం. నరాకృతిలోనే దుష్టశిక్షణ, శిష్టరక్షణ, అజ్ఞానులకు జ్ఞాన బోధ, శృంగార రసజ్ఞులకు కామలీల ప్రదర్శించాడు. మనం అజ్ఞానంతో ఆ నరాకారుని విమర్శించాము. కాని చిరునవ్వుతో మోహన మురళీ నాదంతో అందరినీ ఆనందింప చేశాడు. నరాకృతిలో వున్న నారాయణుడు. అందుకే నరాకృతిలో వున్న నా తండ్రికి నమస్కారము.

## 3. పరబ్రహ్మణే నమః

Parabrahmane Namaha

**పరబ్రహ్మమునకు నమస్కారము**

అనాది, ఆద్యంత రహితుడు యెవ్వరో అతడే పరబ్రహ్మ. చరాచర జగత్తంతా అతని నుండే ఆవిర్భవించింది. ఈ ఆవిర్భావం కూడా ఆ పరబ్రహ్మ సంకల్పమే. ఆవిర్భవించింది అలాగే వుండిపోతే అది జడము. అలాకాక దానికి జీవం ఉంటే వృద్ధి, మార్పు, అంతము తప్పక వుంటాయి. ఈ ప్రక్రియను నియంత్రించేది కాలము. అందుకే ఆయనే కాలుడు. ఏది, యెప్పుడు, యెలా జరగవలెనో నిర్ణయించేది కాలుడే.

పరబ్రహ్మము యొక్క నిర్ణయాన్ని ఆయా సమయంలో నిర్వహించడమే కాలస్వరూపుని పని. ఆ శాసనానికి తిరుగులేదు. ఆ పరబ్రహ్మమే అవసరాన్ని బట్టి ఏదో ఒక రూపంలో ఆవిర్భవిస్తాడు. లేదా, యెవరో వొకరిని ప్రేరేపించి తాను చేయాలనుకొన్నది వారిచేత చేయిస్తాడు. ఆ చేసేవారు కేవలం ఆయన పనిముట్లు, నిమిత్తమాత్రులు. అందుకనే పరిపాలకులు నిమిత్తమాత్రులైన పరబ్రహ్మ స్వరూపులు. మేమే అంతా చేస్తున్నాము అనుకోవటమే అహంకారము.

## 4. యదుకుల చూడామణియే నమః

Yadukula Chudamaniyae Namaha

**యాదవ కులమున జన్మించిన చూడామణికి నమస్కారము.**

పరమాత్మ ఏదో నిమిత్తము వుంటేనే అవతరిస్తాడు. దేవకీ వసుదేవులకు తనమాట నిలబెట్టుకోవడానికి వారి బిడ్డగా పుట్టాడు. కానీ వారికి తన ముద్దుముచ్చట్లనివ్వలేదు. ఆ భాగ్యము గొల్లరాజయిన నందగోపుడికి, అతని భార్య యశోదాదేవికి ఇచ్చాడు. కామకేళి కోరిన గోపికలకు దానిని అనుగ్రహించాడు. శ్రీరామచంద్రుడిగా ఏక పత్నీవ్రతుడైన తానే శ్రీకృష్ణావతారంలో ఎనిమిది మంది భార్యలే కాక పదియారువేలమంది రాచకన్నెలను నరకుడి చెరనుంచి విడిపించి వారి కోరిక మేరకు పెండ్లాడినాడు.

అదెలా సాధ్యమని సందేహించిన నారదుడికి ప్రతి భార్యకు అనుకూలుడైన 'పతి'గా కనువిందు చేశాడు. ద్వారకను నిర్మించి యదుకులాన్ని పరిపాలించాడు. అన్న బలరాముడికి తమ అందరిపై పెత్తనం ఇచ్చాడు. గర్వాంధులైన యాదవులను దూర్వాసముని శాపంతో తుదముట్టించాడు. ఇన్ని విధాలుగా యదుకులాన్ని తీర్చిదిద్దాడు కాబట్టే ఆయన యదుకుల శిరోరత్నం అయ్యాడు. అట్టి యదుకుల చూడామణికి మ్రొక్కి తరించని జన్మకూడా ఒక జన్మేనా?

## 5. వసుదేవ నందనాయ నమః

Vasudeva Nandanaaya Namaha

**వసుదేవుని సుతునకు నమస్కారము**

భగవంతుని లీల యెటువంటిదంటే మన సుకృతానికైనా దుష్కృతానికైనా ఫలితాన్ని ఆ జన్మలోనైనా లేక ముందు రాబోయే జన్మలలోనైనా ఇస్తాడు. అందుకే మనకు మంచి జరిగినా, చెడు జరిగినా మనము నిమిత్తమాత్రులం. ఇది గ్రహించుట కంటే జ్ఞానం మరొకటి లేదు.

మనకు స్వయంగా భగవంతుడే బిడ్డగా జన్మించాడంటే అదెంత గొప్ప వరమో ఆలోచించండి. అయితే అప్పుడు వసుదేవుడు రాజమందిరాలలో లేడు. కారాగారంలో బందీగా వున్నాడు. భగవంతుడే పుత్రుడిగా జన్మించిన వానికి కారాగార దౌర్భాగ్యం దేనికి? అట్టిదశలో కూడా భగవద్దర్శన సౌభాగ్యం యెట్లు కలిగింది. వసుదేవ నందనుడు అని పరమాత్మే పిలిపించుకొన్నాడంటే ఆ వసుదేవునికన్నా ధన్యుడెవడుంటాడు? పొత్తిళ్లలో బిడ్డడైన పరమాత్మనెత్తుకొన్నాడంటే సామాన్యమా?

## 6. భూమి క్లేశ భార హరాయ నమః

Bhoomi klesa bhaara haraaya namaha

**భూదేవియొక్క దుఃఖభారమును హరించినవానికి నమస్కారము**

ఈ భూమిపైనున్న సమస్త జీవులను, స్థావర జంగమములను మోయుచున్నప్పటికీ వాటి తప్పొప్పులను అవి తనకు చేస్తున్న యెంత దురుపయోగమునైనా ఆమె క్షమిస్తుంటుంది. అందుకే "క్షమయా ధరిత్రి అన్నారు పెద్దలు. కాని దుర్మార్గుల భారం మోస్తున్నప్పుడు ఆమెకది పెనుభారము అయి ఆవేదన కలుగుతుంది. మరి అది ఆవిడ యెవరికి చెప్పుకొంటుంది? తన భర్తయైన శ్రీమన్నారాయణునికే.

అప్పుడా స్వామి యేదో ఒక అవతారం యెత్తి దుష్ట నిర్మూలన చేసి ఆమెకు భారం తగ్గించి దుఃఖోపశమనం చేస్తాడు. పనిలో పనిగా మంచివారికి మేళ్లు చేసి రక్షిస్తుంటాడు. అట్లు హరించే హరిని కనుగొనలేని జన్మ నిరర్ధకము. అట్టి స్వామిని శరణని నమస్కరించు వాని జన్మ ధన్యము.

## 7. పుణ్య శ్రవణ కీర్తనాయ నమః

Punya shravana keertanaaya Namaha

**ఎవరి పుణ్య కీర్తనము వినుట వలన పుణ్యము సంప్రాప్తిస్తుందో ఆ స్వామికి నమస్కారము**

నవ విధ భక్తిమార్గములలో కీర్తనము సామాన్యులు సైతము చేయదగినది. ఎంత కీర్తిస్తే అంత శీఘ్రముగా స్వామి కృప ప్రాప్తిస్తుంది. ఎంత కీర్తిస్తే అంత పుణ్యం. ఒకవేళ మనం కీర్తించలేకపోయినా పరులు కీర్తిస్తే వినిన వారికి సైతము పుణ్యం లభిస్తుంది.

ఇంతకంటే సులభోపాయం వుంటుందా? విద్యాగంధం లేని పామరులు సైతము హరికథాశ్రవణం యథాలాపంగా చేసి పుణ్యప్రాప్తిని పొందారు. ఇక మీకు మీరే భక్తితో ఈ త్రిశతి పఠిస్తే యెంత పుణ్యం సాధించవచ్చునో ఆలోచించండి. ఎంత సుదూరప్రయాణమైనా ఆరంభమయ్యేది తొలి అడుగుతోనే కదా!! ఇదే మంచి ముహూర్తం.

## 8. కలిమల సంహతి కల యశః పుంజాయ నమః

Kalimala samhati kala yashaha punjaaya namaha

**కలి కల్మషమును నిర్మూలించు నేర్పులో జగద్విదితమైన కీర్తిగల స్వామికి నమస్కారము**

కలిపురుషుని ప్రభావం చేత అనేక దుష్పరిణామములు చోటుచేసికొంటాయి. ఆ పరిణామములను నిర్మూలించగలవాడు పురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానుడు బహునేర్పరి. దానిలో ఆయనకు సాటిలేని కీర్తి వున్నది. ఆకీర్తి కాంతి కిరణముల వలె జగత్తునందు వ్యాపించినది. అట్టి స్వామికి నమస్కరించుచున్నాము.

కలి ప్రభావం వలన ద్వేషం, స్వార్థం, ధర్మం పట్ల విముఖత కలుగుతుంటాయి. శ్రీకృష్ణ పరమాత్మనే శిశుపాలునివలె నిందించేవారు 'రాజ్యం' చేస్తుంటారు. అయితే ఆయన ఆనాడు ప్రత్యక్షమూర్తియై శిశుపాలుని తల నరికాడు కానీ నేటి కలియుగంలో ఏదో ఒక ప్రమాదం కల్పించి అదృశ్యరూపుడై తల తెగవేస్తుంటాడు. ఇది సత్యం. ఈ సత్యాన్ని గ్రహించలేకపోవటమే కలి మలము.

;

### 9. భక్తిమార్గ ప్రవర్తకాయ నమః

Bhakti maarga pravartakaaya namaha

**భక్తిమార్గములో ప్రవర్తింపజేసి జీవులను ఉద్ధరింపజేయు వానికి నమస్కారము**

భగవంతుని అనుగ్రహము కలుగనిదే ఆలయానికి వెళ్లబుద్ధికాదు, వెళ్లినా నమస్కరించబుద్ధికాదు, నమస్కరించినా నాకు నీవే కావాలి అనిపించదు, అనిపించినా పైకి అనలేము. అలా అనినా మనస్ఫూర్తిగా అనలేము. అలా అనగలిగి, మనస్ఫూర్తిగా నమ్మటమే భక్తి. ఇది వూరకనే కలుగదు. అట్లా కలిగించేది శ్రీకృష్ణ పరమాత్మ, మరెవ్వరూ కాదు.

మనల్ని భక్తిమార్గంలో ప్రవర్తింపజేస్తే మనము మోక్షానికి మొదటిమెట్టు ఎక్కినట్టే. వచ్చిన చిక్కేమిటంటే ఎవరు ఎన్ని మెట్లెక్కాలో, చివరి వరకు ఎక్కుతారో, మధ్యలో పడిపోతారో, నిరాశతో మానేస్తారో, మతిచలించి విడిచిపెడతారో ఎవరికీ తెలియదు. ఈవైకుంఠపాళిలో కఱిచే పాములే ఎక్కువ. ఎక్కే నిచ్చెనలు తక్కువ.

### 10. భక్త జన కల్పవృక్షాయ నమః

Bhakta jana kalpa vrikshaya namaha

**భక్త జనులకు కల్పవృక్షము వంటి వానికి నమస్కారము**

పాలసముద్రమును దేవదానవులు చిలికినప్పుడు శ్రీలక్ష్మి ఆమె తోబుట్టువులుగా అనేక దివ్య సంపదలు కలిగినవి. చంద్రుడు అట్లు పుట్టినవాడే. అందుకనే చంద్రుడు లక్ష్మీనారాయణునికి బావమరిదియైనాడు. వాని తోబుట్టువులైన కల్పవృక్షము, పారిజాత వృక్షము, కౌస్తుభమణి మొదలైనవి ఇంద్రునికి, ఉపేంద్రునికి దక్కినవి. కల్పవృక్షపు ప్రత్యేకత యేమంటే అది కోరిన కోర్కెలను తీరుస్తుంది.

పురుషోత్తముడైన నారాయణునిది కూడా అదే ప్రత్యేకత. అయితే శ్రీహరి దైత్యగుణము కలవారికి కల్పవృక్షము కాదు. ఆయన భక్తజనులకు మాత్రమే కల్పవృక్షము. భక్తి అంటే పరిపూర్ణమైన విశ్వాసము, దాసోగతి. అది పైకి కనబరచేది కాదు. మనో, వాక్, కర్మలలో ప్రతిఫలించేది. అది జరిగితే స్వామివారికి కల్పవృక్షమే.

### 11. దేవకీ నందనాయ నమః

Devakee nandanaaya namaha

**దేవకీ దేవి సుతునికి నమస్కారము**

పూర్వజన్మలో చేసిన తపఃఫలముగా దేవకీ వసుదేవులకు పరమాత్మనందనుడై వారికి జన్మించాడు. దేవకీ నందనుడని కీర్తింపబడిన శ్రీకృష్ణపరమాత్మ వారికి తనను 'కనే' భాగ్యమే ప్రసాదించాడు. వారి కోరిక తీర్చాడు. కాని తన ముద్దు మురిపాలు చూసే అదృష్టం వారు కోరలేదు (పొరబాటు వలన). ఆయన ఈయనూ లేదు. అదే కోరిన నందునికి, యశోదకి తనను పెంచే అదృష్టం ప్రసాదించాడు. ఆయన కల్యాణమూ, సంతానము చూడాలని వారు కోరలేదు, ఆయన ఇయ్యలేదు. దాన్నే కోరుకొన్న దేవకీ వసుదేవులకు దానినే ప్రసాదించాడు. వారు ఆయన ముద్దుమురిపాలు చూడనే లేదు. సూర్యచంద్రులు వెలుగుతున్నంత కాలమూ దేవకీ పుత్రుడనే కీర్తి ఆమెకు కలిగించాడు. తన పుత్ర పౌత్రులను చూచి పెంచే భాగ్యం ప్రసాదించాడు.

### 12. వసుదేవ దేవకీ పుణ్య పుంజ ఫలాయ నమః

Vasudeva devakee punya punja phalaaya namaha

**వసుదేవుడు, దేవకీ దేవి గత జన్మలో చేసిన పుణ్య రాసుల ఫలముగా జన్మించిన స్వామికి నమస్కారము**

జీవులు గత జన్మలలో చేసిన పాప పుణ్యములే వారికి ఈ జన్మలో బిడ్డలవలె సంప్రాప్తించి, తదనుగుణంగా దుఃఖమో, సుఖమో కలుగజేస్తుంటారు. అవి తీరిపోయిన వెంటనే వారు మనలనో మనం వారినో విడిచిపోక తప్పదు. ఇక్కడ విడిచిపోవటం మరణం వలన కావచ్చు. దైహిక యెడబాటు వలన కావచ్చును. గత జన్మలో ఆ దంపతులు చేసిన పుణ్యఫలితంగా జన్మించిన శ్రీకృష్ణపరమాత్మ వారి కోసమే కారాగారంలో జన్మించవలసి వచ్చింది. పొత్తిళ్లలోని పాపడు ప్రకృతిని, యమునా నదిని, గోకులంలో అందరిని నిద్రలో ముంచి వసుదేవుడు చేయవలసిన శిశువుల మార్పిడిని సానుకూల పరిచినాడు. మీరు నిమిత్త మాత్రులు. మీ కర్మానుగుణంగా మీచేతనే అన్నీ నేనే చేయిస్తానని, ఆనాడే ఋజువుచేసినాడు.

## 13. దేవకీ మనః ప్రమోద జనకాయ నమః

Devakee manaha pramoda janakaaya namaha

**దేవకీ దేవి మనస్సునకు గొప్ప సంతోషమును కలుగజేయువానికి నమస్కారము**

దేవకీదేవి మొదటి ఆనందమును తమకు భగవంతుడే బిడ్డడై జన్మించాడని. రెండవ ఆనందము కంసునికి బలికాలేదని. మూడవ ఆనందము ఆ బిడ్డడు యశోద వద్ద ప్రేమగా పెంచబడతాడని ఆశ. అందుచేతనే ఆమెకు ప్రమోదం కలిగింది. అందుకే స్వామికి ఈ నామము అతికినట్లు సరిపోయింది. ఆమె తన ప్రమోదమును మనస్సులోనే దాచికొనినది కానీ బహిర్గతము చేయలేదు. ఏమో గోడలకు చెవులుంటాయేమో? ఎవరు చెప్పగలరు?

## 14. బ్రహ్మాది భక్త వాక్పరి పాలనాయ నమః

Brahmaadi Bhakta vaakpari paalanaaya namaha

కంసుడు మొదలైన రాక్షసాంశతో జన్మించిన రాజుల భారం మోయలేకున్నానని భూదేవి బ్రహ్మాది దేవతలతో మొఱ పెట్టుకొన్నది. వారందరూ తమ స్వామియైన శ్రీమన్నారాయణుని వైకుంఠంలో దర్శించి భక్తితో కీర్తించి తమ గోడును వివరించుకొన్నారు.

చిరునవ్వుతో తమ గోడును వివరించుకున్నారు. చిరునవ్వుతో వారికి అభయమిచ్చాడు స్వామి. వారి వాక్కు నెరవేరుస్తానని వాగ్దానం చేశాడు. భూమిపై అవతరించాడు. లీలామానుషరూపుడైన స్వామి నల్లనయ్యగా పుట్టి, గోపాలునిగా పెరిగి క్షాత్రముతో రాజ్యపాలన చేశాడు.

ముల్లును ముల్లుతోనే తీయాలి అన్నట్లు ధర్మరాజుచేత 'అబద్ధం' ఆడించాడు. అనేకమార్లు పాండవులను రక్షించాడు. గీతాచార్యుడైనాడు. మృతశిశువు పరీక్షిత్తును బ్రతికించాడు. ఎన్నడో చనిపోయిన గురుపుత్రుని ఆయనకు ఇచ్చి గురుదక్షిణ సమర్పించాడు. అసంభవాలను సంభవం చేశాడు. బ్రహ్మతో సహా గర్వించిన అందరికీ గర్వభంగము చేశాడు.

## 15. శేషాద్రి భక్త సేవిత చరణాయ నమః

Sheshaadri bhakta sevita charanaaya namaha

ఆదిశేషుడు మొదలైన భక్తులు సేవించెడి చరణములు గల స్వామికి నమస్కరించుచున్నాను. భగవంతుడు సృష్టించిన అనేక జీవజాతులలో సర్పములు ఒకటి. వాటిలో కూడా విశిష్టమైన సర్పములు వున్నాయి. ఆ విశిష్ట సర్పాలలో వాసుకిని శంకరుడు హారములా ధరించాడు, ఆదిశేషుని శ్రీమహావిష్ణువు పరుండే పాన్పులా స్వీకరించారు.

కర్కోటకుడు, తక్షకుడు మొదలైన క్రూరులు కావలసిన వారిని కాటువేసి సంహరిస్తుంటారు. సాధు స్వభావంగల వారు సత్కీర్తిపొంది సర్పులచే పూజించబడ్డారు. వారు భగవంతుని భక్తితో సేవించి తరించారు. అందుకనే స్వామి చరణ సేవాభాగ్యం వారికి కలిగింది. ఆ చరణాలనే నమస్కరించి తరించండి. ఆ కృప వలననే శేషుడు నారాయణునికి సోదరునిగా అవతారాలను కూడా ధరించి భక్తులచే సేవించబడినాడు.

## 16. కాళిందీవేగ హన్త్రే నమః

Kaalindee vega hantrae namaha

**కాళిందీ నది వేగమును నిరోధించిన స్వామికి నమస్కారము**

వసుదేవుడు తనకు పరమాత్మ ప్రబోధించినట్లే శిశువుగానున్న పరమాత్మను పొత్తిళ్లలో పెట్టుకొని రేపల్లెకు తీసికొని పోతున్నాడు. కాళరాత్రి, వర్షం కురుస్తున్నది. వారు తడిసిపోకుండా ఆదిశేషుడు తన పడగలు విప్పి వారికి గొడుగు పట్టాడు. తన శిరస్సులపై నున్న మణుల కాంతి దారి కనబడునట్లు చేశాడు. ఇంతవరకు వసుదేవుని గమ్యం బాగుగానే వున్నది. కాని యమునా నది(కాళింది) ఉధృతంగా ప్రవహిస్తూ వసుదేవుని నిరోధించింది. ఆయన పరమాత్మను ప్రార్థించాడు. అంత ఉధృతంగా ప్రవహిస్తున్న కాళింది ప్రవాహవేగం నిలిచిపోయింది. వసుదేవుడు పిల్ల కాలువని దాటినట్లు కాళిందీ నదిని దాటినాడు. భగవంతుని ఆజ్ఞకు అందరూ బద్ధులే కదా! వసుదేవుడు దాటిపోగానే అంతా యధావిధిగా మారిపోయింది.

## 17. యోగ మాయాధి పతయే నమః

Yoga maayaadhi patayae namaha

**యోగ మాయకు అధిపతికి నమస్కారము**

సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మ జీవులకు తన యోగమాయతో ఆక్రమించి వివశుల్ని చేసికొంటాడు. దానివలన వారు తామే పనులను నిర్వహిస్తున్నామని భ్రమిస్తూ భగవదేచ్ఛ ప్రకారమే నడుచుకొంటుంటారు. ఈ యోగ మాయాధిపతి ఆజ్ఞ మేరకు ఆనాడు గోకులంలోని వారంతా వివశులై నిద్రిస్తున్నారు. వసుదేవుడు నేరుగా నందుని భార్య యశోద నిద్రిస్తున్న ప్రసూతి గదికి పోయి ఆమె ప్రసవించిన యోగమాయ స్థానంలో తాను తీసికొని వచ్చిన తన శిశువును వుంచాడు. యోగమాయను ఎత్తుకొని మధురానగరానికి తిరుముఖం పట్టాడు. ఆ శిశువును తెచ్చి దేవకీదేవికి ఇచ్చాడు. సంకెలలు వాటంతట అవే బిగుసుకొన్నాయి. ఆ బిడ్డ ఏడుపుతోనే అన్నీ మేలుకొన్నాయి.

## 18. గోకుల పతయే నమః

Gokula patayae namaha

**గోకులమునకు అధినాధుడైన స్వామికి నమస్కారము**

బాలకృష్ణుడు, నందవ్రజమున జీవించే గోపాలకులు సాధువర్తనులు. వారి పూర్వజన్మల సుకృతము వలన వారిలో కొందరికి స్నేహము, కొందరికి ప్రణయము, కొందరికి వాత్సల్యము దక్కినది. భర్తకు తనపత్నినుంచి ఇవే కదా! లభించేది? అటువంటి స్పందన గోకులము నుంచి పొందిన శ్రీకృష్ణ పరమాత్మ నిజముగా గోకులపతి అని పిలువదగినవాడు. అట్టి స్వామికి నమస్కరించినదే కదా! జన్మంటే.

## 19. గోపీ జన వల్లభాయ నమః

Gopi jana vallabhaaya namaha

**గోపికలకు పతియైన స్వామికి నమస్కారము**

భార్యా భర్తల మధ్య వుండేది శారీరక సంబంధము మాత్రమే కాదు. గొప్ప సహధర్మచారిణీ బంధము కూడా వుంటుంది. మొదటిది శారీరకము కావున అశాశ్వతము. రెండవది మానసికము కావున శాశ్వతము. ఇది మానసికము కావున నిత్యనూతనము. పొత్తిళ్లలో శ్రీకృష్ణుని చూచిన గోపికలకు అతడే తమ మనోనాథుడనే భావన కలుగుటయే కాదు, బలపడింది కూడా. పరమాత్మ భక్తుల అభీష్టము తీర్చటానికే అవతరించు. గోపీ జన హృదయాధినాథుడైనాడు. అందుకే ఆయన గోపీనాథుడైనాడు.

## 20. గోకులోత్సవాయ నమః

Gokulotsavaaya namaha

**గోకులమున గొప్ప ఉత్సవము చేయించిన చిన్నారి కృష్ణయ్యకు నమస్కారము**

అది సామాన్యమైన ఉత్సవము కాదు. ప్రతివొక్కరూ అది తమ ఇంటిలో తామే నిర్వహించుచున్న పండుగవలె జరిపించినారు ఆనాటి ఉత్సవాన్ని. ఎవ్వరి ఆనందానికీ హద్దులేదు. ఇక ఆ ఉత్సవము కన్నుల పండుగలా వుంటుంది అని మరొకమారు చెప్పవలసిన పనిలేదు కదా! ఆనాటినుంచి ప్రతి ఇంటిలోనూ ఉత్సవమే, ఆనందమే.

## 21. అఖిలాశా పూరకాయ నమః

Akhilaashaa poorakaaya namaha

**సకల ఆశలను తీర్చిన స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణునితో సామీప్య ముక్తి కోరుకొన్న వారందరి ఆశలను, కోరికలను పూర్తిచేసిన, ఆ దేవదేవుని యేమని కీర్తించగలము? యెంతని సన్నుతించగలము? అందరి ఆశలను పూర్తిచేశాడు స్వామి. అయితే ఇక్కడ అందరూ గమనించాల్సింది ఒకటుంది. ముక్తి కాక మరే ఇతర ప్రాపంచిక కోరికలను కోరినా అది మనకు పరిపూర్ణమైన ఆనందాన్ని ఇవ్వలేదు. యశోదా, నందులు గత జన్మలో ముక్తిని కోరుకోలేదు. స్వామిని పెంచి ఆనందించాలని కోరుకొన్నారు. ఆ భాగ్యమే పొందారు. ఆయన పెళ్లి చూడాలని వారు కోరుకోలేదు. ఆయన ఇయ్యనూ లేదు. దురదృష్టవశాత్తూ మన ఐహిక కోరికలన్నీ లోపభూయిష్టాలే. దానికి ఆయనేం చేస్తాడు.

## 22. యశోదా స్తనం ధయాయ నమః

Yashodaa stanam dhayaaya namaha

**యశోదాదేవి స్తన్యమును గ్రోలిన పరమాత్మకు నమస్కారము**

ఒక్కసారి ఆలోచిస్తే అర్థమవుతుంది. దేవకీదేవి పుణ్యము వలన పరమాత్మ ఆమె గర్భమున అవతరించాడు. కాని ఆమెకు తన స్తన్యమునిచ్చి పెంచే అదృష్టం దక్కలేదు. ఆ అదృష్టం గొల్ల వనితయైన యశోదాదేవికి దక్కింది. కృష్ణయ్యగా ఆయన ఎనిమిది కన్యలను పరిణయమాడినాడు. పదియారు వేలమంది రాచకన్నెలను నరకాసురుని చెరనుంచి విడిపించి వారి కోరిక మేరకు పెండ్లాడినాడు. ఇక్కడ గమనించాల్సింది యేమిటంటే పరిణయ వాంఛ స్త్రీలదే కాని పరమాత్మది కాదు. తన భక్తుల కోరికలు ఆయన నిర్వికారణంగానే తీరుస్తాడు.

అందుకనే తదనుగుణమైన సుఖదుఃఖాలు వారివే కానీ ఆయన నిర్వికార, నిరంజనుడు. ఎవరిదెట్టి భాగ్యమో తెలిసినదెవరికి? ఒక్క ఆ పరమాత్మకే. యశోద చేసిన పుణ్యము వలన స్వామికి స్తన్యమిచ్చి పెంచింది. అల్లరి చేస్తే రోటికి కట్టేసింది. గోరుముద్దలు తినిపించి జోలపాడింది. "ఓయమ్మ నీకుమారుదు.." అని దెప్పిపొడిపించుకున్నది.

## 23. నంద మనోమోదకాయ నమః

Nanda manomodakaaya namaha

**నందుని మనస్సును ఆనందములో ముంచిన స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణుని సమ్మోహన రూపమును చూచి ఆనందించని వారు లేరు. గోకులమున యెవరినోట వినినా నందుని బిడ్డయొక్క ప్రశంసే. ఎంత అందగాడు!!! ఏమా చక్కదనము!!! ఏమా కన్నుల సౌందర్యం!!! ఎవరినోటనైనా ప్రశంసలే. నందగోపుని హృదయం ఆనందంతో పరవశించింది. సంతోషంతో చిందులు వేసింది. గొప్ప పూజల వల్ల పురుషులు(భర్తలు), దానముల వలన బిడ్డలు కలుగుతారని శాస్త్రం చెబుతున్నది. ఇటువంటి బిడ్డకు తండ్రి అయిన నందునిదే పుణ్యం అంటే. ఏమి దానము చేశాడో అతగాడు అని పొగడనివారు లేరు.

## 24. పూతనాంతకాయ నమః

Pootanaantakaaya namaha

**పూతన అను రాక్షసిని సంహరించిన శ్రీకృష్ణునికి నమస్కారము.**

దేవకీదేవి కన్నబిడ్డ వేరొకచోట పెరుగుతున్నాడని హెచ్చరింపబడిన కంసుడు. ఆ బిడ్డడు యెక్కడ పెరుగుతున్నాడో తెలిసికొని సంహరించమని పూతన అను రాక్షసిని నియోగించాడు. అది కామరూపశక్తిగల దిట్ట. అది సౌందర్యరాశిగా మారి చంటి మగశిశువులున్న చోట్లకు పోయి పిల్లలకు తన చనుబాలిస్తూ ప్రేమనటించి, వాటిలోని విషంతో బిడ్డలను సంహరించసాగింది. బిడ్డ చనిపోగానే అదృశ్యమవుతుంది. ఆ కార్యక్రమములో అది ఊరూరు తిరుగుతూ రేపల్లె చేరి కృష్ణునికి పాలు తాపింది. చిన్నారి కృష్ణయ్య ఒక్క పీల్పుతో దాని ఒంట్లోని రక్తాన్ని పీల్చి సంహరించాడు. చనిపోతూ అది తన స్వస్వరూపము పొందింది. పెద్దకొండవలె పడిపోయిన దాని శరీరంపై ఆడుకొంటున్న చిన్నారి కృష్ణుని చూచి అందరూ హాహాకారాలు చేశారు.

## 25. సుకృత జ్ఞాయ నమః

Sukruta jnaaya namaha

**సుకృతము వలన మాత్రమే తెలియదగినవానికి నమస్కారము**

పూతన రాక్షసి శిశు హంతకి. కాని ఆమె పురాకృత పుణ్య విశేషమున మోక్షార్హత సంపాదించినది. అందుకనే శ్రీకృష్ణుని వలన మరణము పొంది మోక్షార్హత సంపాదించి తరించినది. సుకృతము లేకపోతే మన కనుల యెదుట పరమాత్మ వున్నా గుర్తించలేము. ఆయనను అవమానించి పాపం కూడా కట్టుకొంటాం. అదే మనకి ఆయన అనుగ్రహం కలిగితేనే నమస్కరిస్తాం. లేకపోతే నిర్లక్ష్యం చేస్తాము. ఆయనను తెలుసుకోలేము. తెలియటం సంగతి అటు వుంచి తెలుసుకోవాలనే బుద్ధి పుట్టించేదీ ఆయనే కాబట్టి ఆయన కృప కోసము నమస్కరించుచున్నాను.

## 26. పూతనా మోక్ష దాత్రే నమః

Pootanaa moksha dhatre namaha

**పూతనకు మోక్షప్రదాత అయిన స్వామికి నమస్కారము**

పరమాత్ముని చేతిలో మరణించిన వారికి ముక్తిలభించక తప్పదు కదా! నిజానికి శ్రీకృష్ణుడు ఆయా రాక్షసులకు గొప్ప ఉపకారమే చేశాడు. హిరణాక్ష, హిరణ్యకసిపులు, రావణ కుంభకర్ణులు. శ్రీహరికి ప్రియులే గాని శత్రువులు కాదు. వైరులై వారు ఆయనను చేరుకొన్నారు. తండ్రి చెడుదారి బట్టిన కొడుకును దండించినా అది శత్రుత్వంతో కాదు. అట్లా దండించటం తన కర్తవ్యం గనుక దండిస్తాడు. ప్రతిజీవి అంతిమ లక్ష్యం మోక్షమే కాబట్టి వారికి స్వామి చేతిలో మరణం నిజానికి వరమే.

## 27. భక్త మనోరోధకాయ నమః

Bhakta manorodha kaaya namaha

**భక్తుల మనస్సులను అడ్డగించి తనవైపునకు త్రిప్పుకొను స్వామికి నమస్కారము**

కొన్ని కొన్ని సందర్భాలలో స్వామివారి భక్తులే ఆయనకు వ్యతిరేకులవుతుంటారు. కాని ఆయనకు వారెందుకు అట్లా మారిపోయారో తెలుసు కాబట్టి వారి మనస్సులను నిరోధించి తనవైపునకు త్రిప్పుకొంటాడు. తద్వారా వారిని ముక్తిమార్గంలో నడిపిస్తాడు. తండ్రి బిడ్డను సరిదిద్దుకొన్నట్లు, సరిదిద్దుకొంటాడు. అందుకే దానవులు సైతము ముక్తి పొందగలుగుతున్నారు. భగవంతుడే మన హితుడు, స్నేహితుడు. అయితే ఇంకా కావలసినదేమిటి?

## 28. గోకులాభయ దాన చరిత్రాయ నమః

Gokulaabhaya daana charitraaya namaha

**గోకులమునకు అభయ మొసగి కంటికి రెప్పలా కాపాడిన చరిత్ర గలిగిన స్వామికి నమస్కారము**

పూతనతో మొదలిడిన రాక్షస సంహారం కడదాకా కొనసాగించిన శ్రీకృష్ణ పరమాత్మ దుష్టశిక్షణే కాక కుచేలునివంటి శిష్టరక్షణ కూడా చేశాడు. పార్థసారథియై దుర్మార్గులైన రాజలోకాన్ని తుదముట్టించాడు. నరకాసురుడి చెరలోవున్న పదియారు వేలమంది రాచకన్నెలను వారి కోరిక మేరకు పరిణయమాడినాడు. రుక్మిణి, సత్యభామ మొదలైన అష్ట భామలను పరిణయమాడినాడు. దుష్ట రాజలోకానికి భృత్యులైన దుష్టులను అంతమొందింపజేసినాడు. గోపికావల్లభుడైనాడు. ఏది, యెందుకు, యెలాగున చేస్తాడో ఆయన వొక్కడికే తెలుసు. అందుకనే శ్రీకృష్ణావతారము పరిపూర్ణ అవతారము. నేనే పరమాత్మను, నన్నే శరణను. నేనే సర్వమూ చేయిస్తాను. మీరు నిమిత్తమాత్రులు అని నిర్ద్వంద్వంగా చాటిన గోకులాభయ ప్రదాతకు శరణంటే చాలు కదా!

## 29. భక్తప్రపంచ విస్మారకాయ నమః

Bhakta prapancha vismaarakaaya namaha

**భక్తప్రపంచమునకు యెల్లప్పుడు స్మరణములోనుండు స్వామికి నమస్కారము.**

శ్రీకృష్ణ భక్తుల ప్రపంచము సాటిలేనిది. వారు కన్నులు తెరిచినా, మూసినా శ్రీకృష్ణ సాక్షాత్కారం అవుతూనే వుంటుంది. కనులు తెరచినా నీవాయెనే కనులు మూసినా నీవేనాయె అని స్వామి ప్రపంచంలోనే జీవిస్తుంటారు. అది ఒక సాటిలేని విస్మారక స్థితి. ఆకలి దప్పులను విస్మరించి, స్వామి స్మరణలో జీవించేవారు జీవన్ముక్తులు కాక మరేమిటి? నిజానికి ఆ స్థితిని వర్ణించడానికి భాష చాలదు.

## 30. శకట భేదన బాల చరిత్రాయ నమః

Shakata bhaedana baala charitraaya namaha

**బండిలో అదృశ్యరూపునిగా ప్రవేశించిన శకటాసురుని తుత్తునియలు చేసిన బాల్య చరిత్ర కలిగిన స్వామికి నమస్కారము.**

పూతన మరణించిన తదుపరి కంసుడు శకటాసురుడు అను రాక్షసుని బాలుని సంహరించమని పంపినాడు. కృష్ణుని ఆరు బయట ఒక బండిక్రింద నీడలో పరుండబెట్టి యశోద తనపనిలో నిమగ్నమైనది. శకటాసురుడు ఆ బండిలో అదృశ్యరూపుడై ప్రవేశించి హఠాత్తుగా కదలి బాలునిపై బండి నడిపి వధించుటకు ప్రయత్నించినాడు. బాలకృష్ణుడు కాలుచేతులు కదిపి తనకాలితో బండిని అలవోకగా తన్నినాడు. బండి ఒక్కసారిగా గాలిలోనికెగిరి ముక్కలు ముక్కలైనది. శకటాసురుడు అదృశ్యరూపునిగానే మరణించినాడు. ఎవ్వరికీ యేమి జరిగిందో తెలియలేదు. చిన్న చిన్న ముక్కలైన బండి. ఆ ముక్కల మధ్య ఆడుకుంటున్న బాలుడు కనిపించాడు. భయపడిన యశోద బాలుని యెత్తుకొని దిగ్భ్రాంతి చెందినది. అటువంటి బాల్య చరిత్రకల స్వామికి నమస్కారము.

## 31. తృణావర్త విమర్దకాయ నమః

Trunaavarta vimardakaaya namaha

**తృణావర్తుడను రాక్షసుని బాగుగా మర్దించినవానికి నమస్కారము.**

శకటాసురుడు తుత్తునియలై మరణించిన తరువాత కంసునిచే నియోగింపబడిన రాక్షసునిపేరు తృణార్తుడు. వీడు యెంత బరువునైననా యెండుటాకువలె విసరివేయగల సమర్థుడు. వాడు బాలకృష్ణుని కూడా అదేవిధముగా సుడిలో యెగురవేసి సంహరించుదామని అనుకొన్నాడు. కాని బాలకృష్ణుని బరువునెత్తటం వాడికి సాధ్యం కాలేదు. సుడినే కాలు చేతులాడించి సంహరిస్తే వాడు మరణించి గాలిలోనే కలిసిపోయాడు.

రేపల్లెవాసులు గమనించింది కృష్ణుని చుట్టుముట్టిన సుడిగాలిని, చావుకేకను, నేలమీద ఆడుకొంటున్న శిశువును, ఉన్నట్లుండి ఆగిపోయిన సుడిగాలిని. ఇది కృష్ణమాయ కాక మరేమిటి చెప్పండి. మనవంటివారికే తెలియకపోతే ఇక గొల్ల యెల్లమందలకు యేమి తెలుస్తుంది? వారు భయంతో బాలునికి "దృష్టి" తీయించారు.

## 32. భక్తి స్వాశక్తి జనకాయ నమః

Bhakti swaashakti janakaaya namaha

**భక్తిమార్గము బట్టిన వారికి దానంతట అదే ఆసక్తి భగవంతునియందు జనింపజేయు స్వామికి నమస్కారము.**

భగవంతునికి మనపై కృప కలిగితే కాని, మనకు ఆయనపై ఆసక్తి జనించదు. ఒక్కసారికూడా స్వామి ఆలయానికి పోవాలనే ఆలోచనే కలుగదు.

నాస్తికులు చేసే వాదనలు రుచిస్తాయి. సృష్టి ప్రకృతి వలన జరుగుతుందంటారు. కాని ప్రకృతిని ఊహాతీతంగా నియంత్రిస్తున్నదెవ్వరో చెప్పమంటే తెల్లమొగము వేస్తారు. ప్రకృతి రూపంలో మీకు గోచరిస్తాను. అనే భగవద్గీతను నమ్మరు. దీనికి యెవ్వరేమి చేయగలరు? అందుకనే ముందు విశ్వాసం కలిగించుకోండి, స్వామిని శరణనండి. ముందు భక్తి కలుగుతుంది. తదనంతరం స్వామి కృప కలుగుతుంది.

## 33. యశోదా మోహనాశకాయ నమః

Yashodaa mohanaasha kaaya namaha

**యశోదాదేవియొక్క మోహమును నాశనము చేసిన స్వామికి నమస్కారము.**

యశోద తనబిడ్డకు ఆపదలు యెందుకు కలుగుతున్నాయని కలత చెందినది. దానివలన ఆమె మోహము అధికమై వ్యధ పెరిగినది. దానిని నివారించుటకు కృష్ణుడు మన్ను తిన్నట్లు నటించాడు. బలరాముడు యశోద వద్దకు పోయి అమ్మా తమ్ముడు మన్నుతినుచున్నాడని తెలిపినాడు. యశోద ప్రశ్నించగా కృష్ణయ్య లేదమ్మా అని అమాయకంగా చెప్పినాడు.

అయితే నీనోరు తెఱిచి చూపించు అని ఆమె గద్దించింది. తెఱిచిన బాలుని నోటిలో ఆమెకు సూర్య చంద్ర తారకా సహిత గగన మండలము, సమస్త భూమండలము కనుపించింది. ఆమె నివ్వెరపోయి విపరీతమైన మోహమునకు గురి అయినది. మరుక్షణమున ఆమె మోహమును పటాపంచలు చేసి తనను గుండెలకు హత్తుకొనునట్లు చేసినాడు స్వామి. భగవంతుని లీలకు యెల్లలున్నవా?

## 34. రామానుజాయ నమః

Raamaanujaaya namaha

**బలరాముని తోబుట్టువైన స్వామికి నమస్కారము**

రోహిణీదేవి వసుదేవుని మరియొక భార్య. కంసుడు తన మరణమునకు కర్తను కనబోయే వసుదేవుని దేవకీ దేవిని కారాగారములో బంధించినాడు. కానీ రేవతీ దేవికి యెట్టి అపకారమూ చేయలేదు. శ్రీకృష్ణుడు దేవకి అష్టమ గర్భమున జనించవలెను. కాని పరమాత్మ ఒక అద్భుతము చేసినాడు.

దేవకీదేవి సప్తమ గర్భము స్రావమైనది. అదియెట్లు జరిగినదో ఊహాతీతము. అంతేకాదు ఆ పిండము సంకర్షణము చెంది రేవతీ దేవి గర్భమున ప్రవేశించింది. ఆమె ప్రసవించి ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువే బలరాముడని పిలువబడి రేపల్లెలో పెరుగుతున్నాడు. ఆ రామానుజుడే మనస్వామి.

## 35. కృష్ణాయ నమః

Krishnaaya namaha

**నల్లని కృష్ణునకు నమస్కారము**

చాలామందికి నల్లని శరీర వర్ణము యేమి అందము? అని భ్రమ చెందుతారు. అది సరికాదు. స్వామి బొగ్గువలె నల్లగా వుండెడి మెరిసే నీలమేఘములా వుంటాడు. అది ఒక దివ్య మోహన రూపం. దృష్టి మరల్చుకోలేని సౌందర్యం. మరల మరల చూడాలనిపించే సమ్మోహన రూపం. భావనకు అందని చక్కదనం. ఆబాలగోపాలాన్ని అలరించిన ముగ్ధ మోహన సుందర రూపం. దానిని వర్ణించుటకు భాష చాలదు.

## 36. వాసుదేవాయ నమః

Vaasudevaaya namaha

**వాసుదేవునికి నమస్కారము.**

వసుదేవుని నందనుడే వాసుదేవుడు. స్వామికి ఈ నామము అత్యంత ప్రీతిపాత్రము. ఇంతగొప్ప సుకృతము పొందిన వసుదేవుడు నిజంగా ధన్యుడు.

**37. అనంత గుణ గంభీరాయ నమః**

Ananta guna gambheeraya namaha

**అనంతమైన గుణములతో గంభీరముగా నుండు స్వామికి నమస్కారము.**

కొన్ని సుగుణములు, కొన్ని దుర్గుణములు ప్రతి జీవికి వుంటాయి. మానవులలో అన్నీ సుగుణములే వుండవు. అలాగని అన్నీ దుర్గుణములే వుండేవారూ ఉండరు. భగవంతుని వాక్యమేమంటే దుర్మార్గులు మితిమీరి సన్మార్గులు బాధపడుతుంటే ధర్మాన్ని నిలబెట్టుటకు నన్ను నేనే సృష్టించుకుంటాను అని మరి ఆయా అవతారాలలో మేధస్సుకు తెలిసిన గుణాలనే కాక, తెలియని గుణాలను కూడా ప్రదర్శించాడు స్వామి. అయితే ఆ గుణాలన్నీ గంభీరమైన స్వామి ఆశయం నెరవేర్చుటకే. అందుకనే ఈ నామము స్వామికి అతికినట్లు సరిపోతుంది. ఇట్టి అనంత గుణగంభీర రూపునికి నమస్కరించక యెలా వుండగలను?

**38. అద్భుత కర్మణే నమః**

Adbutha karmane namaha

**అద్భుతమైన పనులను చేసిన స్వామికి నమస్కారము**

ఒక పసి బాలుడు చేయలేని పనులను ఇంకొక బాలుడు చేస్తే అందరూ అద్భుతం అని పొగడటంలో ఆశ్చర్యం లేదు. కాని స్వామి చేసిన పనులు అనితర సాధ్యములు. బాలుడేమిటి, అసురులను చంపుట యేమిటి? ఇన్ని అద్భుత కర్మలు ఒక పసివాడు చేయడం యేమిటి?

**39. గోకుల చింతామణియే నమః**

Gokula chintaamaniye namaha

**గోకులమునకు చింతామణి అయిన స్వామికి నమస్కారము**

చింతామణి అనునది ఒక దివ్యమైన మణి. అది క్షీరసాగర మదనమున ఉద్భవించినది. కోరిన వస్తు సంపదను ప్రసాదిఇంచగల మహాత్మ్యముగల మణి అది. స్వామికూడా కోరినవారికి కోరిన కోర్కెలు తీర్చే ప్రభువు. అందుకే ఆయనను చింతామణితో పోల్చినారు. అందుకే స్వామిని గోకులమునకు చింతామణి అన్నారు.

**40. గోప గోకుల నందనాయ నమః**

Gopa gokula nandanaaya namaha

**గోపాలకులకు, గోకులమునకు సంతోషమునిచ్చు స్వామికి నమస్కారము**

చిన్ని కృష్ణుడు తన ఆటపాటలతో గోపాలురకు వేణునాదముతో గోవులను చిలిపి చిన్నారి చేష్టలతే గోపయ్యలను, గోపెమ్మలను అలరించినాడు. నిజానికి వారందరూ దేవతలే. భగవంతుని మనము ఆరాధించగలమే కానీ స్నేహితునిగా చూడలేము. ప్రియునిగా భావించలేము. చెలికానిగా "కోతి కొమ్మచ్చి" ఆటలాడలేము. అంతగొప్ప అదృష్టము కలుగవలెనంటే అది స్వామి కృప కాక మరేమిటి? అట్టి కృపానిధికి నమస్కారము.

## 41. భక్త సర్వ దుఃఖ నివారణాయ నమః

Bhakta sarva dukha nivaaranaaya namaha

**భక్తుల సర్వ దుఃఖములను హరించు స్వామికి నమస్కారము**

మనుష్యులకు కష్టముల వలన దుఃఖము కలుగుతుంది. ఒకే కష్టము ఒకరికి ఎక్కువ దుఃఖము, మరొకరికి తక్కువ దుఃఖము కలిగించవచ్చును. ఎందుకంటే దుఃఖము అనుభవిస్తున్నది ఆత్మ. ఆ ఆత్మను ప్రేరేపించేది పరమాత్ముడే. ఆ ప్రేరేపణ అందరికీ ఒకే రీతిగా వుండదు. స్వామి తన భక్తులకు ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదిస్తాడు. అందుకే వారు కష్టాలకు అవి కలిగించే దుఃఖానికి అతీతులుగా వుంటారు. సర్వ దుఃఖములను ఆ విధంగా నివారించే స్వామి అండ మనకుండగా చింతించుట యెందుకు దండగ? కాబట్టి కృష్ణ భక్తిని మించిన మందు లేదు భవరోగానికి అన్నారు పెద్దలు.

## 42. మహానుభావాయ నమః

Mahaanubhaavaaya namaha

**గొప్ప ప్రభావము కలవానికి నమస్కారము**

లౌకికముగా కూడా గొప్ప సిద్ధులు కలిగిన వారిని మనము మహానుభావులనే పిలుస్తాము. ఇక ఘటనాఘటన సామర్థ్యముగల కృష్ణ పరమాత్మను మహానుభావుడనటంలో విశేషమేముంది? ఆయన ప్రదర్శించిన లీలలు అనన్య సాధ్యములు కదా. దేవేంద్రుని మొదలు చతుర్ముఖ బ్రహ్మ వరకు అందరూ ఆయనను పశుల కాపరిగా భ్రమించి, భంగపడినవారే.

### మధురాష్టకం

**కం॥ శ్రీకృష్ణపరబ్రహ్మను**
**సంకీర్తించెదను "త్రిశతి" సవివరమిత్తున్**
**చేకొని "వల్లభ" గురుకృప**
**ఈకృతి మీకిచ్చుగాక ఈప్సిత సిద్ధిన్.**

## 43. అచింత్య గుణ కర్మణే నమః

Achintya guna karmane namaha

**ఊహకందని గుణములచే కర్మల నాచరించు స్వామికి నమస్కారము.**

అట్టి కర్మలనే భక్తులు పరమాత్ముని లీలలు అంటుంటారు. గొల్లభామల చీరెలెత్తుకెళ్లినాడే కాళింగుని పడగలపై నృత్యం చేశాడు. పాలు, వెన్న దొంగతనం చేసిన చేతులతోనే గోవర్ధన గిరిని యెత్తినాడు. ఆయన గుణ విశేషములు ఇట్టివి అని చెప్పగల వారెవ్వరు?

## 44. నారాయణాయ నమః

Naaraayanaaya namaha

**నరులందరికి జ్ఞాన దృష్టి ప్రసాదించువానికి నమస్కారము**

నరులందరూ జన్మతః అజ్ఞానులే. నారాయనుని కృపలేని వారికి ఆ జన్మ పూర్తి అయినా ఆ శరీరం పోతుందే కానీ జ్ఞానం రాదు. ఇలా యెన్ని శరీరాలు మోసినా నారాయణుని కృప కలిగిన జన్మలోనే జ్ఞానం కలుగుతుంది. ఒకసారి ఆయన కృప కలిగితే మధ్య మధ్య మనము అజ్ఞాన భ్రమలో పడిపోయినా ఆయనే లేవదీసి రక్షిస్తుంటాడు. అటువంటి నారాయణమూర్తికి నమస్కరించని జన్మ జన్మేనా?

### 45. వ్రజాంగణరింఘణ జాను చరణారవిందాయ నమః

Vrajaangana ringhana jaanu charanaaravindaaya namaha

**గోపీ రమణులతో రమించిన కవనీయ చరిత కలస్వామికి నమస్కారము.**

గోపికలందరూ స్వామి స్పర్శకై తపించిన దేవతా రమణులు. వారి కోరిక బలానికి స్వామి అనుగ్రహం తోడై వారి సంగమం జరిగింది. అది సాధారణ స్త్రీ పురుష సంబంధం కాదు. ఒక్కొక్క నారికి ఒక్కొక్క హరియై శృంగార రసావిష్కారము జరిగిన రాసకేళి అది. నారీ నారీ నడుమ మురారి, హరికి హరికీ నడుమ వయ్యారియై భాసిల్లిన శ్రీకృష్ణ లీల అది. మాటలకు, భావనలకు అందని తన్మయత్వమది. నేటి కలికాలం ధూర్తులు. వక్రభాష్యం చెప్పినా, నాటి శిశుపాలుని వంటి నీచులు తెగడినా స్వామి చిరునవ్వే సమాధానం.

### 46. వ్రజ పంకాంగ లేపనాయ నమః

Vraja pankaanga lepanaaya namaha

**గొల్లెతల చెమట చిత్తడిని లేపనముగా దాల్చిన స్వామికి నమస్కారము.**

శరీరపు చెమట చిత్తడి సామాన్యులకు యేహ్యము. ప్రేమికులకు సుగంధము అని నానుడి. కాని గొల్లెతలను వలచి వలపించుకొనిన స్వామికి సుగంధ పరిమళ లేపనము. వారిదే భాగ్యమనిన.

### 47. భక్త పరీక్షా పరిపాలకాయ నమః

Bhakta pareekshaa paripaalakaaya namaha

**భక్తుల అనురాగాన్ని పరీక్షించి, వారిని పరిపాలించు స్వామికి నమస్కారము.**

పైకి అందరూ భక్తిని ప్రదర్శించేవారే. కానీ వారి అంతరంగంలో ఆ విశ్వాసం వుండదు. స్వామి దగ్గర అటువంటి భక్తి చెల్లదు. భక్తిలో పరిపూర్ణమైన విశ్వాసం కూడా వుండాలి. అది స్వామి పరీక్షకు నిలబడాలి. అప్పుడే వారిని, వారి జీవితాలను ఆయన పరిపాలిస్తాడు.

### 48. వ్రజ హార మణయే నమః

Vraja haara manaye namaha

**నందవ్రజము అను హారమున మణియై భాసిల్లు వానికి నమస్కారము.**

నందవ్రజము అను పల్లెలోని ప్రజలు ఒక సమూహమై నందగోపుని నాయకత్వంలో యశోద ఆదరణలో మధురానగరమున పాలు, పెరుగు, వెన్న, నెయ్యి విక్రయించుకొని ప్రశాంత జీవనం గడుపుతున్నారు. నందుని ముద్దుబిడ్డ బాలకృష్ణుడు వారికి కంటి వెలుగు. వారందరిని హారంతో పోల్చితే చిన్నారి కృష్ణయ్య మణిపూస వంటి వాడు. అట్టి స్వామికి నమస్కారము.

## 49. గోకుల ధూర్త చరిత్రాయ నమః

Gokula dhoorta charitraaya namaha

**గోకులమునందు మోసకారివలె చరిత్ర కలిగిన స్వామికి నమస్కారము.**

స్వామి వొకరిననేమిటి? గోపికలందరితో ధూర్తుని వలెనే ప్రవర్తించినాడు. పైకి వారందరూ ఆగ్రహించినా తమ మనస్సులలో మాత్రము ఆ అల్లరిని ఆనందించారు. శ్రీకృష్ణ లీలలను వర్ణించడం యెవరికి శక్యము. గర్వించిన వారికి గర్వభంగము చేసినాడు. అత్తా కోడళ్ళకు తగవులు పెట్టినాడు. భార్యా భర్తలను వుడుక్కునేట్లు చేసినాడు. వదినా మరదళ్లకు కన్నుగీటినాడు. పాలకుండలను దోసినాడు. వెన్న గోప బాలులందరికీ పంచినాడు. నేయిని నేలపాలు చేసినాడు. ఈ ధూర్త ప్రవర్తనకు గోకులమున అందరికీ మతులు బోయినవి.

## 50. భక్త వశీకరణ చరిత్రాయ నమః

Bhakta vasheekarana charitraaya namaha

**తన భక్తులను వశీకరణము చేసికొను చరిత్ర గల స్వామికి నమస్కారము.**

వింత యేమిటంటే మనము యెంతో సుకృతము చేసికొంటేగాని స్వామి దృష్టి మనపై పడదు. ఒకసారి ఆయన దృష్టి పడిన పిమ్మట మన విశ్వాసం స్థిరమైనదా, లేక గాలివాటుకు యెగిరిపోయేదా అని ఆయన పరీక్షిస్తాడు. ఆ పరీక్షకు నిలబడిన భక్తులను వశీకరణము చేసికొని మనను వదలడు. తనున్న ఉన్నతస్థానం నుండి దిగివచ్చి దగ్గరకు తీసికొంటాడు. ధృవుడు, ప్రహ్లాదుడు, కుచేలుడు.. ఇలా చెప్పుకొంటూ పోతే ఆ గణనకు అంతేలేదు. పరీక్ష నెగ్గడం అంటే వైకుంఠపాళిలో నిచ్చెనలెక్కడమే. పరీక్ష ఓడిపోతే పాము కాటు కూడా తప్పదు.

## 51. నవనీత లవాహారాయ నమః

Navaneeta lavaahaaraaya namaha

**వెన్నను అల్పాహారముగా స్వీకరించిన స్వామికి నమస్కారము**

చిన్ని కృష్ణుడు నవనీత ప్రియుడు. యశోద వేదన ఒక్కటే. అది తమ ఇంట్లో కుండల నిండగా అంత వెన్న వుంటే తమ బాలుడు పరుల ఇండ్లలోని వెన్ననెందుకు దొంగిలిస్తాడని? ఆ రహస్యం మాత్రము ఆవిడకు అంతుబట్టనే లేదు. వెన్న ఎలా వస్తున్నది? చిన్నారి లేగదూడలు త్రాగవలసిన పాలను గొల్లెతలు పిండుకొని, తోడుపెట్టి పెరుగుచేసి చిలికి వెన్న చేసి అమ్ముకొంటున్నారు. ధనాశ వారిని ఆ కక్కుర్తి పనిచేయిస్తున్నది. దీనిని నిరోధించటమే కృష్ణుని కార్యక్రమము. గొప్పజ్ఞానులకే అర్థము కాని ఈ లీల యశోదకు యెట్లు వగతమవుతుంది?

## 52. దధి దుగ్ధప్రియాయ నమః

Dadhi dugdha priyaaya namaha

**పెరుగు, అప్పుడే పిదుకబడిన ప్రియమైన స్వామికి నమస్కారము**

ఒకసారి మానవులకు ధనముపై ఆశ కలిగిందంటే అది వాడు ఊపిరి విడిచిపెట్టి మరణించేదాక ఆ ఆశ వాడిని విడువదు. ధనకాంక్ష అతి తీవ్రమైనది. తమ ఆదాయము పోతున్నదని బాధపడినవారేగానీ తమ తప్పులు తెలుసుకోలేకపోయారు రేపల్లెలోని వెఱ్ఱులు.

### 53. క్షీర కణావ విధ ముఖారవిందాయ నమః

Ksheera kanaava vidha mukhaaravindaaya namaha

**పాలతరకలు అంటుకొనగా ప్రకాశిస్తున్న ముఖపద్మముగల స్వామికి నమస్కారము.**

పాలు త్రాగిన దొంగ యెవరో తెలిసిపోయేలా పాలచారికలు మూతికి అంటుకొన్నాయి. వాటిని తుడుచుకోలేదు. పాలదొంగ యెవరో తెలిపే ఆమూతిని చూస్తే ఏ తల్లి నవ్వదు? మరి యశోదదే కదా! ఆ అదృష్టం ఆమెకందించిన ఆ స్వామి ముఖారవిందాన్ని ఊహించుకొని పరవశించే భక్తులదీ అంత అదృష్టమే. చిన్నారి బాలునికి నమస్కరించి తరించండి.

### 54. మృత్స్నా భక్షణ భీత యశోదా తాడన సంత్రాస నయనారవిందాయ నమః

Mrutsnaa bhakshana bheeta yashodaa taadana santraasa nayanaaravindaaya namaha

**మన్ను తిన్నాడని యశోద దండించబోతే మిక్కిలి భయము కనుపించు కన్నులు గల స్వామికి నమస్కారము.**

బలరామకృష్ణులు వాకిట్లో ఆడుకుంటున్నారు. చిలిపి కృష్ణయ్య చేతితో మన్ను తీసికొని నోటిలో పెట్టుకొన్నాడు. పరుగుపెట్టి యశోద కడకు చేరిన అన్నగారు యశోదమ్మకు కృష్ణుడు మన్ను తిన్నాడన్న సమాచారము చేరవేసినాడు. పిల్లవాడికి మన్ను తినడం అలవాటైతే ఆరోగ్యం చెడిపోతుంది. యశోద బాలకృష్ణుని గదమాయించి దగ్గరకు పిలిచింది. ఆమె యేమి చేయబోతుందో అందరికీ తెలుస్తూనే వున్నది. అప్పుడు బాలకృష్ణుని చూడవలసిందే.
తల్లి దండించబోతున్నది. కొడుతుందనే భయం కన్నులలో కొట్టొచ్చినట్లు కనబడుతూనే వున్నది. తామరపూలవంటి కన్నులు కల స్వామి కళ్లు భయంతో విచలిస్తున్నాయి. అట్టి మనోహరమూర్తిని భావించి నమస్కరించినదే జన్మ.

### 55. సర్వ విమోహకాయ నమః

Sarva vimohakaaya namaha

**సర్వ జీవులయొక్క గొప్ప అహంకార మోహమును తొలగించిన స్వామికి నమస్కారము.**

జన్మించిన ప్రతి జీవికి నేను, నాది అనే అజ్ఞానం పుట్టుకతో వస్తుంది. చాలామందికి అది మరణించేదాకా వుంటుంది. స్వామి అనుగ్రహం కలిగిన వారికి అది తొలగిపోతుంది. అందరి అజ్ఞానము తొలగించేవాడు స్వామియే. అది తొలగందే ఆయన అనుగ్రహం కలిగి తద్వారా జ్ఞానం ప్రాప్తిస్తుంది.

### 56. మహాత్మ్య ప్రదర్శకాయ నమః

Mahaatmya pradarsakaaya namaha

**మహత్యమును ప్రదర్శించిన స్వామికి నమస్కారము**

రామావతారంలో కేవలం నరోత్తమునిగానే ప్రవర్తించిన స్వామి తన కృష్ణావతారంలో భగవత్ లీలను ప్రదర్శించాడు. ఆకృష్ణ లీలలలో అనేకులు తరించారు. వారంతా తమ జన్మతరించిందనే భావించారు. భీష్మాదులు ఆయన భగవంతుడని గ్రహించినా తమ కర్తవ్యం నెరవేర్చారు. ఆయనను ఆయన కర్తవ్యం నెరవేర్చేటట్లు చేశాడు. తాను ఎవరిని అనుగ్రహించాలనుకొన్నాడో వారికి తన భగవల్లీల కనులకు గట్టేటట్టు ప్రదర్శించాడు.

## 57. పరబ్రహ్మత్వ బోధకాయ నమః

Parabrahmatva bodhakaaya namaha

**పరబ్రహ్మ తత్త్వమును బోధించిన స్వామికి నమస్కారము**

చెరశాలలో దేవకీ వసుదేవులకు దర్శనమిస్తూ పరమాత్మ తనపరబ్రహ్మత్వ తత్త్వము యెటువంటిదో వివరించాడు. జీవులందరి ఆత్మలలో నివసిస్తున్నవాడే పరమాత్మ. ఆయననే పరబ్రహ్మ అంటారు. పరబ్రహ్మత్వమే పరమాత్మ విశిష్టత. ఎప్పుడూ తన సృష్టిలో ధర్మం నశించి, అధర్మం పేట్రేగిపోతుంటుందో అప్పుడు ఆయనను ఆయనే సృష్టించుకొంటాడు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామావతారముల తదనంతరం తాను శ్రీకృష్ణునిగా జన్మించబోతూ దేవకీ వసుదేవులకు తన తత్త్వాన్ని వివరించాడు స్వామి.

## 58. సర్వజనీన మహాత్మ్యాయ నమః

Sarva janeena mahaatmyaaya namaha

**జనులందరికీ తన మహాత్మ్యమును చూపిన స్వామికి నమస్కారము**

ఆనాటి రేపల్లెలో జనులందరికీ తన మహాత్మ్యమును చూపారు స్వామి. అయితే అక్రూరుని వంటి నిజభక్తులు మాత్రమే ఆ మహిమలను గ్రహించి స్వామిని ఆశ్రయించి తరించారు. కాని శిశుపాల, జరాసంధుని వంటి అజ్ఞానులు అవి గారడీ విద్యలనుకొన్నారు. మనకు భగవత్కృప కలిగితేనే నమ్మకం కలుగుతుంది. నమ్మకం కలిగితేనే కృప లభిస్తుంది. ఇది చెట్టు ముందా? విత్తు ముందా అనే చిక్కు ప్రశ్న. నిజం తెలిసేది ఆ నీలవర్ణునికే.

## 59. దధి భాండ భేత్రై నమః

Dadhi Bhaanda Bhetrai namaha

**పెరుగు కుండలను పగులగొట్టిన స్వామికి నమస్కారము**

గోకులంలో గోపికలు పెద్ద కుండల్లో పెరుగు దాచుకొనేవారు. చిన్నారి కృష్ణయ్యకు అంత పెద్ద పెరుగుకుండ అందదు. అతగాడు చక్కటి తరుణోపాయం కనిపెట్టాడు. ఒక కవ్వం తీసికొని కుండ బద్దలుకొడితే సరి. వెదజిమ్మిన పెరుగును అన్నంతతిని, తోటి పిల్లలకు తినిపించవచ్చును. నేటికీ "కుండబద్దల" వంశస్థులున్నారంటే మరి అది స్వామి ఘనత కాక మరేమిటి? అవన్నీ అటుంచి ఆనాటి కుండబద్దలయ్యకు నమస్కరించుచున్నాను.

## 60. చౌర్య విశంకితేక్షణాయ నమః

Chourya visankitekshanaaya namaha

**దొంగతనం చేస్తున్నంత సేపూ అనుమానంగా దిక్కులన్నీ గాలించే విశాల నయనములు గల స్వామికి నమస్కారము**

ఒక పక్కన దొంగిలిస్తూనే, ఎవరన్నా వస్తున్నారేమోనని ఆతృతగా చూచే ఆ చూపులకు మఱువ సాధ్యమా?

## 61. భక్తాధీనాయ నమః

Bhaktaadheenaaya namaha

**భక్తుల ఆధీనములోనుండు స్వామికి నమస్కారము**

పరమాత్మ సర్వస్వతంత్రుడైనప్పటికీ తన నిజమైన భక్తులకు వశుడై వారి కోర్కెలను మన్నిస్తుంటాడు. అందులోనే ఆయనకు పరిపూర్ణమైన ఆనందం కలుగుతుంది. ఆయన సుఖదుఃఖాలకు అతీతుడైనప్పటికీ ఇష్టాయిష్టాలకు అతీతుడు కాదు. తన భక్తుల సంతోషమే ఆయన సంతోషం.

## 62. దామోదరాయ నమః

Daamodaraaya namaha

**దామముతో ఉదరమున కట్టబడిన స్వామికి నమస్కారము**

దామము అంటే పశువులను కట్టివేయు త్రాడు అని అర్థం. తమ పెరట్లో వున్న రెండు మద్దిచెట్లు ఒకదానికి ఆనుకొని ఇంకొకటి వుండటం చూసినాడు. ఏమి ఆలోచన వచ్చిందో కానీ విపరీతంగా అల్లరి చేస్తూ తల్లిదగ్గర చనుబాలు త్రాగుతానని మారాము చేయడం మొదలెట్టాడు. పని తొందరలో తీరికలేని యశోద కొంచెము ఆగుమన్నది.

బాలుడు వినకుండా గొడవ చేస్తున్నాడు. చెప్పిన మాట వినలేదని కోపించిన తల్లి ఒకదామముతో బాలుని పొట్టకు బిగించి కట్టిదానితో వానిని ఒక రోటికి బంధించి వుంచాలనుకొన్నది. అదేమి చిత్రమో ఎంతపొడుగు త్రాడూ చాలలేదు. తనకు కనబడిన త్రాళ్లనన్నింటిని ముడివేసింది. అయినా ఆ చిన్నారి పొట్టను త్రాళ్లతో బంధించలేకపోయింది. రోషంతో కళ్లవెంట నీళ్లు, శరీరంపై చెమటలు. తల్లిని చూచి స్వామికి జాలికలిగి తనని కట్టనిచ్చాడు. బాలుని కట్టివేసి విజయగర్వంతో నవ్వుకొన్నది ఆ పిచ్చితల్లి. స్వామి దామోదరుడైనాడు.

## 63. యమలార్జున భంజనాయ నమః

Yamalaarjuna Bhanjanaaya namaha

**యమలార్జున(మద్దిచెట్లను) పడగొట్టిన స్వామికి నమస్కారము**

కుబేరుని ఇద్దరు పుత్రులు ధనమదాంధులై నారదముని అవమానించి ఆయన శాపమువలన నందవ్రజమున రెండు మద్దిచెట్లవలె జీవించవలసి వచ్చింది. వారు పశ్చాత్తాపముతో వేడుకొంటే నారాయణుడు కృష్ణుడై ద్వాపరయుగంలో మిమ్మల్ని నేలకూలిస్తే మీకు శాప విమోచన అవుతుందని అనుగ్రహించాడు. యశోదచే రోటికి కట్టివేయబడిన బాలకృష్ణుడు మెల్లగా రోటిని లాగుతూ మద్దిచెట్ల మధ్య రోటిని లాగి వాటిని కూల్చినాడు. దానితో శాప విముక్తిని పొందిన గంధర్వులు బాలునికి నమస్కరించి స్తుతించి తమ లోకానికి మఱలిపోయాడు. పెరట్లో గొప్ప ధ్వని వచ్చిందని పరుగు పరుగున వచ్చిన యశోద, తదితర గోపికలు కూలిన మద్దిచెట్లను చూచి భీతిల్లి, అమాయకంగా రోటికి కట్టివేయబడిన చిన్నారిని చూచి యశోదను మందలించినారు. తానూ దుఃఖించి యశోదబాలునికి 'దృష్టి' తీయించింది.

## 64. భక్త వాక్య పరిపూర్ణకాయ నమః

Bhakta vaakya paripoornakaaya namaha

**భక్తుల వాక్యమును పరిపూర్ణము చేయు స్వామికి నమస్కారము**

నారదుడు శ్రీహరి పరమభక్తుడు. తన భక్తుడు ఇచ్చిన శాపమును ఉపసంహరించవలసిన బాధ్యత స్వామిదే. లేని వాక్యమును పరిపూర్ణము చేయవలసిన బాధ్యతా స్వామిదే. అందుకే రోటికి కట్టివేయబడినాడు రోటిని ఈడ్చుకొంటూ మద్దిచెట్లు మధ్యనుంచి రోటిని లాగి మద్దిచెట్లను కూల్చినాడు.

## 65. భక్తి దాత్రేనమః

Bhakti Daatre namaha

**భక్తిని ప్రసాదించువానికి నమస్కారము**

జీవులకు భగవంతునిపై భక్తి దానంతట అదే కలుగుతుంది. దానికి ప్రేరణ భగవంతుడు ఇవ్వవలసిందే. ఆ ప్రేరణ ఒక సంఘటన ద్వారా కలుగవచ్చు, ఒక మనిషి ద్వారా కలుగవచ్చు, ఒక స్ఫురణ ద్వారా కలుగవచ్చు. కానీ దేనికైనా పరమాత్మ సంకల్పం వుండవలసిందే. తగిన సమయంలో, తగిన విధంగా ఆ మార్పు జరుగుతుంది. చాలామంది భక్తులు తొలినాళ్లలో నాస్తికులే. ఆ తరువాత భక్తి వారిలో చిగురించి, విశ్వాసమై చివరికి జీవనాడిగా మారుతుంది. అక్కడ నుంచి మోక్షమార్గం మొదలవుతుంది. ముక్తి యెన్నడో ఆ ముకుందునికే తెలుసు.

## 66. సర్వేశ్వరాయ నమః

Sarveswaraaya namaha

**అందరికీ ఈశ్వరుడు (ప్రభువు) అయిన స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణుడు పరమాత్మయొక్క పరిపూర్ణ అవతారం. జనన, మరణములే కాక, రాగద్వేషములు ప్రదర్శించి, మనిషికి కర్తవ్య పాలనయే పరమార్థం అని ప్రబోధించిన అవతారం అది. దేవేంద్రుడు భూమికి దిగివచ్చి ఆయన అనుగ్రహం వేడిన అవతారం అది. దైవముని నారదుడు అనేక పర్యాయములు సంస్తుతించిన అవతారం అది. అందుకనే ఆయనను సర్వేశ్వరుడని కీర్తించారు. శిశుపాలుని వంటి ధూర్తుని కూడా మన్నించి ముక్తినొసగిన స్వామి ఆయన.

## 67. సర్వాయ నమః

Sarwaaya namaha

**సమస్తమూ తానే అయిన స్వామికి నమస్కారము**

సృష్టిలోని సమస్తము భగవంతుడే. చలనము కలిగినవి, చలనము లేనివి. నీటిలోను, నింగిలోను, నేలపైన వున్నవన్నీ భగవంతుడే. అజ్ఞానులైన జీవులు ఈ సమస్త తత్త్వాన్ని అర్ధంచేసికొనలేరు. అర్ధంకానంతమాత్రాన సత్యం అసత్యం అవుతుందా? అందుకనే భగవంతుని సర్వుడు అంటారు.

## 68. నంద విమోచిత బంధనాయ నమః

Nanda vimochita bandhanaaya namaha

**నందుని బంధనముల నుండి విమోచనము చేసిన స్వామికి నమస్కారము**

ఒకనాడు నందుడు యమునా నదిలో స్నానమాడుచుండగా వరుణలోకము నుంచి వరుణుని భటులు యేతెంచి ఆజ్ఞలేక అక్కడకు రాకూడదని ఆయనను బంధించి వరుణుని కారాగారమునకు చేర్చిరి. నందుడు యమునానదిలో మాయమైనాడని విని శ్రీకృష్ణుడు బలరామ సహితుడై వరుణుని నగరమును చేరి ఇదేమని ప్రశ్నించెను. వరుణుడు ఇది కావాలనిచేసిన అపరాధము కాదని పొరబాటున జరిగిన తప్పిదమని శ్రీకృష్ణుని క్షమ వేడుకొని నందుని పురస్కారములతో సత్కరించి శ్రీకృష్ణునకిచ్చి పంపించెను.

## 69. ఉపనంద ప్రియాయ నమః

Upananda priyaaya namaha

**ఉపనందుడను యాదవునికి ప్రియమైన స్వామికి నమస్కారము**

రేపల్లెలో జరుగుచున్న భయానక సంఘటనలను చూచి గొల్లవారంతా బెంబేలెత్తిపోయినారు. రాక్షసులేమిటి జనావాసాల్లోకి రావడమేమిటి? పసివానికి ప్రాణగండము తప్పటమేమిటి? ఏనాటివో తెలియని జంట మద్దిచెట్లు ఈదురుగాలి కూడా లేకుండా ఒకేసారి కూలిపోవడమేమిటి? రోటికి కట్టివేయబడిన బాలుడు ఆ చెట్లమధ్య చిక్కుకుపోవడమేమిటి? ఏమిచేయాలో పాలుపోని గోపయ్యలకు ఉపనందుడను యాదవపెద్ద తనకు తోచిన హితవు చెప్పాడు. మనము మఱియొక ప్రాంతమునకు వలసపోయెదము. యమునానదీ తీరమున బృందావనము అని ఒక ప్రాంతము మనకు ప్రశస్తమైనది. మధురానగరము దగ్గరనే వున్న ఆ చోటు మన అందరికీ అనుకూలము. శ్రీకృష్ణునికి యెంతో నచ్చిన మాట అది. అందుకనే స్వామిని ఉపనందప్రియుడని కీర్తిస్తున్నారు.

## 70. మాతురుత్తుంగ గతాయనమః

Maaturuthunga gataaya namaha

**తల్లి ఒడిలో ఉత్సాహముగానున్న స్వామికి నమస్కారము**

ఉపనందుని బోధన పాటించి గొల్లవారంతా బృందావనమునకు ప్రయాణమైనారు. ఎడ్లబండ్లలో స్త్రీలు వస్తుంటే వారి చేతులు పట్టుకొని బాల బాలికలు, వారి చంకలలో పసికందులు అంతా ఆనందంగా, ఉత్సాహంగా ఉన్నారు. ఇక బాలకృష్ణుడు సరేసరి. ఆయన అద్భుత లీలా వైభవాన్ని ప్రదర్శించే సమయం ఆసన్నమైనదని ఆ స్వామీ ఉత్సాహంగానే ఉన్నాడు.

## 71. వృందావన క్రీడారతాయ నమః

Vrundaavana kreedaarataaya namaha

**బృందావనములో ఆటలాడుటయందు ప్రీతి కలిగిన స్వామికి నమస్కారము**

పచ్చని పచ్చిక బయళ్లూ, యమునా నదిమీద నుంచి వీచే గాలి తెమ్మెరలు సువిశాలమైన మైదానములు గల బృందావనము బలరామకృష్ణులనే కాక గోపబాలురను, గోపయ్యలను, గోపికలను విశేషముగా ఆకర్షించినది. అందులోను క్రీడలయందు ఆసక్తిగల కృష్ణుని గురించి చెప్పేది యేమున్నది. వారు అత్యంత సంతుష్టులైనారు.

## 72. వత్సవాలు చరాయ నమః

Vatsavaalu charaaya namaha

**లేగదూడల వెంట చరించిన స్వామికి నమస్కారము**

గొల్లవారికి ఆవులను ఆవుదూడలను పచ్చిక బయళ్లలో మేపుట దినచర్య. బాలురు దూడలను మేపుటతో ప్రారంభించి యువకులైన పిమ్మట ఆవులను మేపుదురు. చిన్నికృష్ణుడు లేగదూడల వెంట తగిలి వాటిని మేపుట నేర్చినాడు.

## 73. వత్సాసుర హన్త్రే నమః

Vatsaasura hantre namaha

**వత్సాసురుని సంహరించిన స్వామికి నమస్కారము**

తన వేగుల ద్వారా నందాదులు రేపల్లెను వదలి బృందావనము చేరినారని వినిన కంసుడు నిజం నిర్ధారించుకోవటానికి వత్సాసురుడనే రాక్షసుని నియోగించాడు. వాడు యెట్టకేలకు బృందావనము చేరి ఒక లేగదూడవలె మారి బలరామకృష్ణులు దూడల్ని కాయుచున్న చోటునకు పోయి తానూ ఒక వత్సమై తిరుగుతున్నాడు. శ్రీకృష్ణుడు తనకు తానుగా గోవధ చేయడు. అందుకని కృష్ణుడు బలరామునికి సమాచారం చేరవేశాడు. అతను సమయం కోసం వేచివుండి తమపైకి వేగముగా వస్తున్న వత్సము యొక్క నాలుగు కాళ్లను పట్టుకొని గిరగిర తిప్పి నేలకు విసిరికొట్టాడు. వాడు నిజరూపం ధరించి అరుస్తూ మరణించాడు. బలరామకృష్ణులిరువురూ ఒకే అవతారం అని ఇందుమూలంగా తెలిసిపోతున్నది.

## 74. బక విదారణాయ నమః

Baka vidaaranaaya namaha

**బక(కొంగ) రూపములోనున్న రాక్షసుని చీల్చి సంహరించిన స్వామికి నమస్కారము.**

శ్రీకృష్ణుని సంహరించుటకు కంసుడు వినియోగించిన అనేక రాక్షసులలో బకాసురుడొక్కడు. పేరుకి తగినట్లే వాడు ఒక కొంగగా మారి గోపాలురు నీరు త్రాగుటకు యమునానదికి వస్తుండుట గమనించి ఆ ప్రదేశమున కొంగజపం చేస్తూ వేచివున్నాడు. తన సమీపమునకు కృష్ణుడు రాగానే చటుక్కున చేపను మింగినట్లు మింగాలని వాడి ఉద్దేశ్యము. సర్వజ్ఞుడైన పరమాత్మ ముందు వాడి జిత్తులు పనిచేస్తాయా? కృష్ణుడు అమాయకంగా తనవద్దకు రాగానే పెద్ద కొంగవలె మారిపోయి, వాడు కృష్ణుని మింగాలనుకొన్నాడు. అయితే కృష్ణుడు లాఘవంగా ఒక కాలితో కొంగ క్రింది భాగాన్ని తొక్కిపట్టి, రెండవ భాగాన్ని చేతులతో పట్టి నోటిని చీల్చివేసినాడు. దానితో బకుడు మరణించి ముక్తిని పొందాడు.

## 75. వృందావన చారిణే నమః

Vrindaavana chaarine namaha

**బృందావనములో సంచరించే శ్రీకృష్ణునికి నమస్కారము**

పరమాత్మ పాదముద్రలను పొందిన బృందావనము పునీతమై నేటి కలియుగంలో కూడా పుణ్యతీర్థమై అలరారుచున్నది.

## 76. ధేనుకాసుర ఖండనాయ నమః

Dhenukaasura khandanaaya namaha

**ధేనుకాసురుని ఖండించి సంహరించిన స్వామికి నమస్కారము**

ఆవును గాని, దాని దూడను గాని బాధించనని స్వామి నియమము. దానిని ఆయన పాటించాడు కాబట్టి తన అన్న బలరామునిచేత ఆ కార్యక్రమములు నిర్వహింపజేసినాడు. నిజానికి శ్రీకృష్ణ బలరాములిరువురూ పరమాత్మ అవతారములేనని పెద్దలు చెబుతారు. అందుకనే బలరామునికి అంత ప్రాధాన్యత కల్పించి 'పెద్దరికం' అమరించినాడు శ్రీకృష్ణపరమాత్మ.

## 77. ఉత్తాల తాల భేత్రై నమః

Uttaala taala bhetrai namaha

**పొడవైన తాటిచెట్టును (దానిలోనున్న రాక్షసుని) విఱిచి సంహరించిన స్వామికి నమస్కారము**

కంసుని పనుపున మరియొక రాక్షసుడు బృందావనము చేరినాడు. తాటిపండ్లు తినుటయందు ఆసక్తిగల శ్రీకృష్ణుని సంహరించుటకు తాటిచెట్టుగా మారుట మంచిదని భావించినాడు. ఎత్తైన తాడిచెట్టుగా మారి పుష్కలమైన తాటికాయలు కలిగియుండెను. ఎత్తైన చెట్టునెక్కడం గొప్పకదా? కృష్ణుడు ఆ చెట్టునెక్కుతానని ఎక్కి చూస్తుండగానే దానిని వంచి విఱిచివేశాడు. దానితో ఆ రాక్షసుడి కథ ముగిసింది.

## 78. సర్వప్రాణి సుఖ సంచార కర్త్రే నమః

Sarva praani sukha sanchaara katrai namaha

**సర్వప్రాణులు సుఖముగా సంచరింపజేయు స్వామికి నమస్కారము**

సర్వప్రాణికోటిలో జీవం రూపంలో వుండే ప్రాణము సాక్షాత్తు ఆ నారాయణుడే. ఏక్షణాన ఆ ప్రాణము దేహాన్ని విడిచిపెడుతుందో అప్పుడు అది కేవలం ఒక శవమే. శరీరమంతా వ్యాపించి వుండే ప్రాణము భగవంతుడే కాబట్టి దానిని ఆత్మ అన్నారు. ఆ ఆత్మే పరమాత్మ. కాని శరీరం ధరించాక అజ్ఞానం ఆవరించి తానే పరమాత్మననే సత్యం విస్మరించి చచ్చేదాకా తానే ఆ జీవినని భావిస్తూ కొట్టుమిట్టాడు తుంటాడు.

## 79. గోకుల సుఖ వాసాయ నమః

Gokula sukha vaasaaya namaha

**గోకులములో సుఖముగా నివసించిన స్వామికి నమస్కారము**

గోకులములో వున్నంత కాలమూ ఆయన ప్రాణులందరికి ఆనందమే పంచినాడు. ఆ స్వామిని ద్వేషించినవారు లేరు. యశోదకు కృష్ణుని ఆగడాలను విప్పి చెప్పినా అందులో ప్రేమే వున్నది కాని, ద్వేషము లేదు.

## 80. గోరజః చ్ఛురిత కుంతలాయ నమః

Gorajaha churita kuntalaaya namaha

**దూడలను కాయు సమయమున రేగిన గోధూళితో ఎఱ్ఱబడిన ఉంగరాల జుట్టు కలిగిన స్వామికి నమస్కారము**

పెద్దలు, కవులు, పౌరాణీకులు ఆ దివ్యమంగళ స్వరూపాన్ని యెన్నో విధములుగా కీర్తించి తరించారు. ఆ దివ్యమంగళ రూపానికి నమస్కరించినది జన్మకానే కాదు.

## 81. వేణు వాద విశారదాయ నమః

Venu vaada visaaradaaya namaha

**వేణువును వూదుటలో నిష్ణాతుడైన స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణుడు తోటి గోపబాలురతోను బలరామునితోను కలిసి ఆవు దూడలను బృందావనమున మేపుటకు పోవుచుండెను. విశ్రాంతి సమయమున కృష్ణయ్య వెదురు బొంగుతో ఒక మురళిని తయారుచేసి దానితో మధుర రాగములను నాదించు చుండెను. అత్యద్భుతమైన ఆ వేణురాగముల గురించి వర్ణించ సాధ్యము కాదు. అది ఒక దివ్యానుభూతి, రసప్రవాహిని.

## 82. వన కుసుమావలీ రచితా కల్పాయ నమః

Vana kusumaavalee rachitaa kalpaaya namaha

**బృందావన తోటలలో గల పూలతో అల్లిన మాలలతో అలంకరింపబడిన స్వామికి నమస్కారము.**

సహజముగనే శ్రీహరి అలంకార ప్రియుడు. శ్రీహరి లీలామానుష రూపంలో అవతరించినవాడు శ్రీకృష్ణుడు కాబట్టి పూవు పుట్టగానే పరిమళిస్తుందన్న చందమున కృష్ణస్వామి వనములలో పూలతో అల్లిన మాలల పట్ల ప్రీతిగలవాడై వర్ధిల్లినాడు. అట్టి దివ్యమంగళ రూపాన్ని తనివితీరా దర్శించిన బృందావన వాసులదే కదా! భాగ్యమంటే.

## 83. అను గీయ మాన యశః పుంజాయ నమః

Anugeeya maana yasaha punjaaya namaha

**అనుసరించి కీర్తించదగిన గౌరవము కీర్తి ధారాళముగా గల స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణుడు బృందావనములో సన్మానించదగినవి, కీర్తించదగినవి, సామాన్యులకు అర్థము కానివి, సామాన్యులకు అసాధ్యమైనవి అయిన లీలలు ప్రదర్శించినాడు. ముందుగా భక్తిలేనివారి బుద్ధి కొలదే ఆలోచనలుంటాయి కాబట్టి చిత్తములలో స్వామిని ధ్యానిస్తూ ఈ శ్రీకృష్ణ లీలలు చదవాలి.

## 84. గోపీ తాప హారకాయ నమః

Gopi taapa haarakaaya namaha

**గోపికల మదన తాపమును హరించిన స్వామికి నమస్కారము**

శ్రీరామచంద్రుని మనోహర సౌందర్యమునకు ముగ్ధులైన కొంతమంది దేవతా స్త్రీలు, మునులు ఆయన పరిష్వంగం వాంఛించారు. రావణవధ నిమిత్తమై అవతరించిన స్వామి తాను ఆ అవతారం ప్రజలకు నీతి, నిబద్ధతలు బోధించుటకు. రావణ వధ అట్టి సత్యవ్రతముతోనే సాధ్యము. కావున వారి కోర్కెలను మన్నించలేననియు రాబోయే కృష్ణావతారంలో వారి కోర్కెలు తీరుస్తాననియు చెప్పినాడు. సామాన్యులకు శృంగార క్రీడ, స్వామికి నిబద్ధ వాక్పరిపాలన. సామాన్యులు పుట్టుకకు సంతోషిస్తారు, మరణానికి దుఃఖిస్తారు. కానీ జ్ఞానులు పుట్టుక వద్దంటారు. మరణం బంధవిముక్తి అని ఆనందిస్తారు. మరి జ్ఞానేశ్వరుడైన స్వామి గురించి చెప్పేదేముంది? అందుకే విరహతాపం గోపికలకే కాని స్వామికి కాదు. తాపాన్ని హరించటమే స్వామి వరప్రసాదము.

## 85. గోపీ నయనార విందార్చితాయ నమః

Gopee nayanaara vindaarchitaaya namaha

**గోపికల పద్మ నయనములతో అర్చించబడిన స్వామికి నమస్కారము.**

గోపికలు శ్రీకృష్ణ స్వామి ప్రేమామృతమును ఆస్వాదించు వరముతో జన్మించిన దేవతా స్త్రీలు మరియు మునులు. వారి ప్రేమ హృదయములకు సంబంధించినది. అది శారీరకమైనది కాదు. ఆత్మీక భావన. కన్నులతో త్రాగగల మధురానందము. అది అనుభవైకవేద్యము. సామాన్యుల వర్ణనకందనిది.

## 86. లౌకిక లీలా ప్రదర్శకాయ నమః

Loukika leelaa pradarsakaaya namaha

**పరమాత్మ లీలలు పలురకాలుగా వుంటాయి. ఎన్నడూ**

పరమాత్మ లీలలు పలురకాలుగా వుంటాయి. ఎన్నడూ తనను నమ్మని నాస్తికుని పరమభక్తునిగా, మునిశ్రేష్ఠునిగా మారుస్తాడు. భాగవతోత్తముని భ్రష్ఠుడిని చేస్తాడు. అందులో కొన్ని లౌకిక లీలలు. చిన్నారి బాలుడు ఘోర రాక్షసులను సంహరించడము అటువంటిదే కదా! కాకపోతే గోకులం వాసులు మన కృష్ణయ్య అద్భుత కార్యములు చేయగల ఘనుడు అని నమ్మి తమ సర్వస్వమూ కృష్ణయ్యేనని భావించారు.

## 87. విష మూర్ఛిత గోపాల జీవన దృష్టయే నమః

Visha moorchita gopala jeevana drashtaye namaha

**విషము యొక్క ప్రభావముచేత మూర్ఛిల్లిన గోవులు, గోపాలురకు పునర్జీవనము నిచ్చిన స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణుని రక్షణ లేకపోతే ఆ సర్పము యొక్క విషప్రభావము చేత గోవులు, గోపాలురు మరణించి వుండేవారు. ఆ విష సర్పము పేరు కాళింగుడు. దాని మదము నణచుటకు కృష్ణయ్య నిశ్చయించినాడు.

## 88. భక్త పరీక్షకాయ నమః

Bhakta pareekshakaaya namaha

**భక్తుల విశ్వాసమును పరీక్షించి, నిర్ధారించుకొను స్వామికి నమస్కారము.**

మానవమాత్రులకు యెదుటి వారు తాము చూపుతున్న వినయము, ఆదరణ నిజమైనదో లేక నటనో గ్రహింపునకు రాదు. కానీ పరమాత్మ సర్వజ్ఞుడు. ఆయనకు ఏది నిజమైన భక్తియో, యేది నటనో తెలుసు. కానీ మనకు తెలియుటకే ఆయన మన విశ్వాసాన్ని పరీక్షిస్తుంటాడు.

## 89. కాలియ ఫణి మాణిక్య రంజిత శ్రీపదాంబుజాయ నమః

Kaaliya phani maanikya ranjita sreepadaambujaaya namaha

**కాళీయుని పడగల మీద నున్న మాణిక్యముల చేత శోభిల్లిన మంగళకర పాద పద్మములు గల స్వామికి నమస్కారము**

యమునా నదిని విషమయము చేస్తున్న కాళీయుడు అను సర్పమును శిక్షించాలని శ్రీకృష్ణుడు వాని పడగల మీదకు లంఘించి నర్తించడం మొదలుపెట్టాడు. ఆ సర్పము పడగల మీద గల దివ్యమైన మాణిక్యముల కాంతిలో స్వామి పాదపద్మముల వెలుగులు చిమ్మినవి. ఆ నృత్యము చూపరులకు మనోహరమే కానీ కాళీయునకు ప్రాణాంతకముగా నున్నది. వాని నోళ్లనుండి రక్తము ధారాళముగా స్రవించినది. పదునాలుగు భువనములు బొజ్జలనున్న స్వామి బరువు భరించుట సాధ్యమా?

## 90. నాగపత్నీ సమర్చితాయ నమః

Naagapatnee samarchitaaya namaha

**కాళీయుని భార్యలచేత సన్నుతించబడిన స్వామికి నమస్కారము.**

కాళీయుని పడగల మీద నర్తించుచున్న శ్రీకృష్ణుని చూడగానే ఆ కాళీయుని భార్యలకు కృష్ణుడు భగవంతుడని అర్థమైన కాళీయుని భార్యలు శ్రీకృష్ణుని స్తుతించి ప్రసన్నుని చేసికొనినారు.

## 91. భక్తాశ్రయ జల స్థల విశోధకాయ నమః

Bhaktaasraya jala sthala visodhakaaya namaha

**ఆశ్రయించిన భక్తునికి (కాళీయునికి) అనువైన జలస్థలమును సూచించిన స్వామికి నమస్కారము**

ఉత్తములకు తప్పుచేసిన వారిపై పగ వుండదు. వారిని తప్పిదమునకే దండింతురు. పొరబాటు గ్రహించిన వెంటనే క్షమించి అనుగ్రహింతురు. గరుత్మంతుని రక్షణకు యమునా నదిని ఆశ్రయించిన కాళీయుడు భయం తీరగానే గర్విష్ఠియై చెలరేగి అపరాధము చేసి కృష్ణుని తాడనమునకు గురియైనాడు. గరుత్మంతుని భయము తీరనేలేదు. అందుచే కృష్ణుడు తన పదముద్రలు నాగజాతి శిరసులపై అనుగ్రహించి వాటిని చూచిన గరుడుడు సర్పములను సంహరించదని అనుగ్రహించెను. అందుకే స్వామి భక్తవత్సలుడు.

## 92. నానావిధ క్రీడా రతారాతాయ నమః

Naanavidha kreedaa rataaraataaya namaha

**అనేక రకములైన ఆటలయందు ఆసక్తి కలిగిన స్వామికి నమస్కారము**

లేగదూడలను కాయుటకు వినియోగించబడిన శ్రీకృష్ణుడు తనతోటి గొల్లపిల్లలతో ఆవుదూడలను మేపుచూ దొరికిన సమయములో తోటి బాలురతో కలిసి కోతికొమ్మచ్చి, దొంగదొర, పరుగు పందెములు వంటి బాల్యక్రీడలు ఆడెడివాడు. ఒక్కొక్కప్పుడు గెలిచిన వారిని తన భుజములపై మోసికొని పరుగులు తీసేవాడు. ఇది ఆగోప బాలురు చేసి కొనిన పుణ్యం కాక మరేమిటి? జగన్నాథుని చూచుటయే పుణ్యమైతే ఆయనచేత మోయించుకోవటం సామాన్య పుణ్యమా?

## 93. ప్రలంబ ఘాతకాయ నమః

Pralamba ghaatakaaya namaha

**ప్రలంబుడను రాక్షసుని పిడికిలి దెబ్బతో చంపిన స్వామికి(బలరామునికి) నమస్కారము**

బృందావనములో లేగదూడగలను కాయుచు విరామములో అనేక ఆటలు ఆడుచుండెడివారు. కంసునిచే చంపబడిన ప్రలంబాసురుడనెడివాడు చాలా పొడగరివాడు. గోపబాలుని వలె రూపము ధరించి అందరితో కలిసిపోయెను. ఇంత పొడగరి గొల్లపిల్లవానిని అందరూ వింతగా చూచినా రాక్షసుని గుర్తించిన బలరామకృష్ణులు తెలియనట్లే వుండిరి. పిల్లలు రెండు జట్లుగా చీలిరి. ఒకదానిని కృష్ణుడు రెండవ దానికి బలరాముడు నాయకులు. బలరాముని జట్టు కృష్ణుని జట్టును మోయవలసి వచ్చినది. బలరాముడు ప్రలంబుని భుజములపై మోయుచు పరుగుతీసినాడు. ఉన్నట్లుండి వాడు తన బరువును విపరీతముగా పెంచినాడు. వెంటనే బలరాముడు వాడిని క్రింద పడవేసి ఒక్క గుద్దుతో మట్టికరిపించినాడు.

## 94. దావాగ్ని పతిత గోకుల రక్షకాయ నమః

Daawaagni patita gokula rakshakaaya namaha

**దావాగ్నిలో చిక్కువడిన గోవులను గోపాలురను రక్షించి ప్రాణములు నిలిపిన స్వామికి నమస్కారము.**

## 95. అగ్ని ముఖాయ నమః

Agni mukhaaya namaha

**అగ్నిముఖుడైన కృష్ణయ్యకు నమస్కారము**

దావాగ్ని కీలలలో చిక్కుకుపోయిన లేగదూడలు అంబారవములతోను, గోపాలురు ఆర్తనాదములతోనూ బొబ్బలు పెట్టారు. ఆక్షణంలో కృష్ణయ్య తన నోటిని మహాద్భుతంగా విస్తృతంచేసి ఆ కార్చిచ్చును చటుక్కున మ్రింగివేశాడు. అంత గొప్ప దావాగ్ని చటుక్కున ఆరిపోయి స్వామి నోటిలో మాయమైపోయింది.

## 96. సర్వర్తు క్రీడా వాలాసాయ నమః

Sarvartu kreeda vaalaasaaya namaha

**అన్ని ఋతువులలోను రకరకాల క్రీడల పట్ల అనురక్తి, విలాసమును చూపిన స్వామికి నమస్కారము.**

నేటి కాలంలో కూడా ప్రజలు మఱచిపోని ఉట్ల పండుగ, హోలీ పండుగ, కోతి కొమ్మచ్చులాట, ఉప్పుమూట ఆట, దొంగ పోలీసు ఆట వంటివి ఆనాటి కాలంలో కృష్ణయ్య ప్రతిపాదించిన ఆటలే. అందుకే కృష్ణం వందే జగద్గురుం అన్నమాట పండితులకే కాదు, పామరులకూ వర్తిస్తుంది.

### 97. గోకుల చారు విచిత్ర చరిత్రాయ నమః

Gokula chaaru vichitra charitraaya namaha

**గోకులములో అందమైన మరియు విచిత్రమైన చరిత్రను ప్రదర్శించిన స్వామికి నమస్కారము.**

గోకులములో స్వామి రాక్షసులను సంహరించాడు, గోపబాలురతో కోతి కొమ్మచ్చులాడినాడు, మధురమైన వేణునాదంతో ఆబాల గోపాలమును మధుర భావనలో ముంచెత్తినాడు. గోపీ రమణులను పుత్రవాత్సల్యంతో మురిపించినాడు. గోపీ కన్నెలకు శృంగార భావనలు కల్పించినాడు. గోపయ్యలకు మనకు ఈతడే నాయకుడు అనుకొనేటట్లు చేసినాడు. యద్భావం తద్భవతి అనునట్లు జగన్నాథుడైనాడు.

### 98. గోపికా ధైర్య విమోచక వేణు నాదాయ నమః

Gopikaa dhairya vimochaka venu naadaaya namaha

**శ్రీకృష్ణుని వేణునాదము వినుటతోడనే గోపికలకు ధైర్యము, తెగువ వచ్చి బాహాటంగానే అతనిపై ప్రదర్శించారు. అట్టి వంశీమోహనునికి నమస్కారము.**

అదిఒక రసవాహిని. వారు వీరు అనే తారతమ్యాలు లేవు. అందరూ శ్రోతలే, అందరూ పునీతలే.

### 99. గోపికా నయన పానైక పాత్రాయ నమః

Gopikaa nayana paanaika paatraaya namaha

**గోపికలందరికి కన్నుల ద్వారా మాధుర్యమును త్రాగు అనుభూతిని కలిగించిన స్వామికి నమస్కారము.**

### 100. శ్రుతి రూప గోపికా వర్ణిత నిఖిల గుణాయ నమః

Shruti roopa gopikaa varnita nikhila gunaaya namaha

**శ్రుతుల గురించి వినని గోపికలకు సైతము వాటిలో వివరింపబడిన స్వామి, సమస్త సద్గుణములను అనుభూతికి తెచ్చి కృష్ణునకు నమస్కారము.**

గోపికలందరూ తమ పూర్వజన్మలో మునులు, దేవతలు. వారిలో స్త్రీ పురుషులందరూ వివశులే. స్వామి అనుగ్రహంచేత వారందరూ గోపికలై అమందానంద కందళిత హృదయారవిందులైనారు. చరితార్థులైనారు.

**101. గోప కన్యావ్రత ఫలాయ నమః**

Gopa kanyaavrata phalaaya namaha

**గోప కన్యలు ఆచరించిన వ్రతమునకు ఫలితముగా వారిని అనుగ్రహించిన స్వామికి నమస్కారము**

గోపకన్యలందరూ కృష్ణుడు తమకు పతికావలెనని మార్గ శీర్షమాసమున ఒక వ్రతము నాచరించిరి. దాని ఫలితముగా కృష్ణయ్య ప్రేమ వారికి లభించినది.

**102. జలక్రీడా సమాసక్త గోపీ వస్త్రాపహారకాయ నమః**

Jala kreeda samaasakta gopee vastraapahaarakaaya namaha

**జల క్రీడలాడుటకు సిద్ధపడిన గోపికల వస్త్రాపహరణ చేసిన స్వామికి నమస్కారము.**

దేహాభిమానము వున్నంతవరకు జీవులకు 'నేను, నాది' అనే భావన పోదు. అది వున్నంతవరకు ముక్తి అసాధ్యము. దైవ భక్తి వలన ఉన్నత జన్మ సిద్ధిస్తుందే కానీ వారికి ముక్తి రాదు. గోపికలందరూ ఉన్నత జన్మల నుంచి భగవత్సాన్నిధ్యానికే గోపికలైనారు. కానీ వారిని దేహాభిమానం సిగ్గురూపంలో వెంటాడుతూనే వున్నది. అందుకే స్వామివారి వస్త్రములను అపహరించినాడు. వారు యమునలో తలకనబడునంత వరకు మునిగి వస్త్రములిమ్మని ప్రార్థించారు. నీటి నుంచి వెలువడి చీరలు తీసికొనమనినాడు స్వామి. వారికి తప్పలేదు. ఆవిధంగా వారికి అది చివరిజన్మయై ముక్తి లభించింది. ఇది భగవంతుని లీల. దీనిని కుత్సితముగా ఆలోచించేవారి గతి యేమిటో భగవంతుడు కూడా చెప్పలేదు.

**103. ముక్తోప సర్పకాయ నమః**

Muktopa sarpakaaya namaha

**ముక్తులైన వారి దరికి చేరువాడు ఈ సంసార బంధనములనుంచి యెవరు ముక్తులౌతారో వారి వద్దకు స్వామి స్వయంగా తానే చేరుకొని కైవల్యం ప్రసాదిస్తాడు.**

**104. వృందావన బోధకాయ నమః**

Vrindaavana bodhakaaya namaha

**బృందావనములో గోపికలకు భగవత్తత్వమును బోధించిన స్వామికి నమస్కారము.**

శ్రీకృష్ణుడు భగవద్గీతను మానవాళికి అందించిన భగవానుడు. మానవ జన్మ అజ్ఞానంతో ఆరంభమై అజ్ఞానంతోనే ముగుస్తుంది. స్వామి కరుణ యెవరిపై ప్రసరిస్తే వారికి జ్ఞానం కలుగుతుంది. తద్వారా ముక్తి లభిస్తుంది.

## 105. యజ్ఞ భోక్త్రే నమః

Yajna bhoktrai namaha

**యజ్ఞఫల భోక్త అయిన స్వామికి నమస్కారము**

యజ్ఞము నాచరించుట ప్రజల క్షేమమునకే కదా! యజ్ఞము నాచరించి దాని పుణ్యఫలమును నివేదించేది భగవంతునికే. ఆయన ఆ ఫలాన్ని ఇంద్రుని ద్వారా తద్యంబంధిత దేవతలకు అందిస్తాడు. తృప్తి చెందినవారు వర్షములు కురిపించి, భూసారమును రక్షించి, వలసిన సూర్యతాపమునందించి పంటలు పండించి భుక్తి, సంపద నందిస్తాడు. జీవులు సుఖంగా జీవిస్తారు. ఈ కార్యక్రమమును యజ్ఞము ద్వారా నిర్వహించుచున్న పరమాత్మకు నమస్కారము.

## 106. యజ్ఞ భాగ భుజే నమః

Yajna bhaaga bhuje namaha

**యజ్ఞ భాగమును నివేదించగా భుజించిన స్వామికి నమస్కారము**

తమ తప్పును గ్రహించిన బ్రాహ్మణులు కృష్ణుడు సాక్షాత్తు యజ్ఞ నారాయణుడిని గ్రహించిన బ్రాహ్మణులు భక్తితో స్వామికి యజ్ఞలమును నివేదించారు. వారిని క్షమించిన స్వామి ఆ నివేదనను స్వీకరించాడు.

## 107. ధర్మ రక్షకాయ నమః

Dharma rakshakaaya namaha

**ధర్మ రక్షకునికి నమస్కారము**

శ్రీకృష్ణావతార ఉద్దేశ్యమే ధర్మ సంస్థాపనము. దానికోసం స్వామి గొల్లవారింట పెరిగాడు. దుర్మార్గులైన రాజుల చేత అవమానింపబడినాడు. సారధియై బాణముల గాయాలు సహించాడు. తన భక్త రక్షణకు జీవించాడు.

## 108. యజ్ఞపత్నీ ప్రసాద కాయ నమః

Yajna patnee prasaada kaaya namaha

**యజ్ఞపత్నులను అనుగ్రహించి వారి భక్తికి సంతసించి మోక్షమును అనుగ్రహించాడు. అట్టి అవతార పురుషునికి నమస్కారము.**

## 109. సర్వాజ్ఞాన నివారకాయ నమః

Sarvaajnaana nivaarakaaya namaha

**సమస్త అజ్ఞానములను నివారించు స్వామికి నమస్కారము**

శ్రీకృష్ణావతార ఉద్దేశ్యమే ధర్మ సంస్థాపనము. దానికోసం స్వామి గొల్లవారింట పెరిగాడు. దుర్మార్గులైన రాజుల చేత అవమానింపబడినాడు. సారథియై బాణముల గాయాలు సహించాడు. తన భక్త రక్షణకు జీవించాడు.

**శ్లో॥ ఇతి బాలచరిత్రస్య నామ్నామష్టోత్తరం శతమ్**
**కృష్ణభక్తి హృదాన్ కీర్తనాద్భుక్తి బోధకం**

**ఆ.వె॥ బాల చరిత జెప్పగల నూరునెనిమిది**
**నామములను తెలిపినారు గురులు**
**పరమ భాగవతులు వల్లభాచార్యులు**
**తెలుగుసేసినాను దేవదేవ**

## ముందుమాట

శ్రీమద్వల్లభాచార్య విరచిత "త్రివిధ నామావలి" అను గ్రంధమునకు సరళ తెలుగు వివరణ అందించే ప్రయత్నం శ్రీకృష్ణ భగవానుని ప్రేరణతో చేస్తున్నాను. 15 సంవత్సరాల క్రితం డా. బీవీఎస్ఆర్ మూర్తిగారి ప్రోత్సాహంతో త్రివిధ నామావలిని చిన్నపుస్తకంగా అచ్చువేయించి సన్మిత్రులకు పంచిపెట్టాను.

ఇన్నాళ్టికి దాని వివరణ అందించాలనే ఆలోచన కలిగింది. ప్రస్తుతం మూర్తిగారు గుజరాత్‌లో ఉంటున్నారు. 90 వసంతాల వారు ప్రోత్సహించి నాకు సహాయం చేయలేరనే బెంగతో నేను వెనకాడినా డా. జీఎం రామశర్మగారి సహాయం లేకపోతే సంస్కృతము రాని నావంటి అవిటివాని వలన ఈ పని సాధ్యమవుతుందా?

మా పెద్ద అబ్బాయి చి. ఏవీఎస్ రామకృష్ణ ప్రోద్బలం నా బలం అని చెప్పటం నా విధి.

వల్లభాచార్యుల వారు 3 భాగాలుగా చెప్పిన దీనిని పూర్తిచేయించే భారం మాత్రం పురుషోత్తముడైన ఆ జగద్గురువుదే. నేను కేవలం నిమిత్తమాత్రుడను.

అన్నట్లు దీనిని డీటీపీ చేసినది మురళీకృష్ణయే. నా వెబ్‌సైటలో పెట్టేది పాండురంగడు.

ఇది భగవత్ కృప కాక మరేమిటి? దీనిని నిత్యపారాయణ చేసినవారికి ముక్తి కరతలామలకం అని చెప్పటంలో నాకు అణుమాత్రం సందేహం లేదు.

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః